
MRR 69 TV

అవినీతిపై అక్షర సమరం

# మన అంకుశం

సంచలన సాయంకాలం దినపత్రిక

ఎడిటర్ : మచ్చా రామలింగారెడ్డి | సంపుటి : 6 | సంచిక : 41 | శుక్రవారం 20 ఫిబ్రవరి 2026 | పేజీలు : 4 | వెల : 3/-




## దిగ్గజ సంస్థ ప్రతినిధులతో సమావేశాలు..

# పలు ఒప్పందాలు

ఢిల్లీలోని భారత్ మండపం వేదికగా జరుగుతున్న ఇండియా-ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్

ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్‌లో పాల్గొన్న సీఎం చంద్రబాబు



**(అంకుశం ప్రతినిధి, న్యూ ఢిల్లీ, ఫిబ్రవరి 20):**

ఢిల్లీ వేదికగా నిర్వహించిన ఇండియా- ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్‌లో సీఎం చంద్రబాబు శుక్రవారం హాజరై పలు దిగ్గజ సంస్థ ప్రతినిధులతో వరుస సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు ఒప్పందాలు కుదుర్చుకున్నారు. ఈ సదస్సుకు హాజరైన ప్రపంచ క్వాంటం-ఏఐ రంగాలకు చెందిన దిగ్గజ సంస్థల ప్రతినిధులు. ఈ సదస్సులో ఐబీఎం సహా వివిధ ప్రముఖ సంస్థలతో సీఎం చంద్రబాబు సమక్షంలో ఒప్పందాలు కుదుర్చుకున్న రాష్ట్ర ప్రభుత్వం. ఏపీలో క్వాంటం-ఏఐ రంగాల్లో నైపుణ్యాభివద్ధి, మౌళిక వసతుల అభివద్ధి కల్పించే దిశగా ఏడు ఒప్పందాలు. ఏపీని క్వాంటం-ఏఐ హబ్ గా తీర్చిదిద్దడం... అమరావతిలోని క్వాంటం వ్యాలీకి జాతీయ, అంతర్జాతీయ స్థాయి గుర్తింపు తెచ్చేలా ఎంఓయూలు. భవిష్యత్ టెక్నాలజీని అందిపుచ్చుకునేలా విద్యార్థులు, యువతకు ఏఐ-క్వాంటం రంగాల్లో శిక్షణ, ప్రభుత్వ శాఖల్లో ఏఐ-క్వాంటం వినియోగం, టెక్నాలజీ ద్వారా ప్రజలకు సేవలను సులభతరం చేయడం వంటి అంశాలపై రాష్ట్ర ప్రభుత్వం ఫోకస్. ఏపీలో ఏఐ-క్వాంటం ఎకో సిస్టం పెంపొందించడానికి బాటలు వేయనున్న ఏడు ఎంఓయూలు చేసుకుంది. ఇందులో భాగంగా క్వాంటం, ఏఐలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేసేందుకు యూనైటెడ్ నేషన్స్ ఇంటర్నేషనల్ కంప్యూటింగ్ సెంటర్‌తో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం. అమరావతి క్వాంటం వ్యాలీలో ఈ ఏడాది చివరి నాటికి ఏఐ క్వాంటం ఎక్స్ లెన్స్ సెంటర్ ఏర్పాటు చేసేలా కార్యాచరణ. ఏఐ-క్వాంటం డిజిటిల్ ఎంబసీగా సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్ ను తీర్చిదిద్దేలా ప్రణాళికలు. రాష్ట్ర ప్రభుత్వంతో జరిగిన ఒప్పందం కార్యక్రమానికి హాజరైన యూఎన్ఐసీసీ డైరెక్టర్ సమీర్ చౌహాన్ సహా ఆ సంస్థ ప్రతినిధులు. క్వాంటం, ఏఐ, సైబర్ సెక్యూరిటీలో రాష్ట్రంలోని 1 లక్ష మంది యువతకు శిక్షణ ఇచ్చేలా ఐబీఎంతో ఎంఓయూ చేసుకున్న రాష్ట్ర ప్రభుత్వం. ఐబీఎం గ్లోబల్ డిజిటల్ లెర్నింగ్ ప్లాట్ ఫాం ద్వారా ఐటీ పరిశ్రమకు అవసరమైన నైపుణ్యాల్లో శిక్షణ ఇచ్చేలా ఐబీఎం ఎంఓయూ. భారత్ లో భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా టెక్ వర్క్ ఫోర్సును సిద్ధం చేసుకునే లక్ష్యాల్లో భాగంగా ఐబీఎం శిక్షణా కార్యక్రమం. ఒప్పందం కార్యక్రమానికి హాజరైన ఐబీఎం ఇండియా ఎండీ సందీప్ పటేల్, ఆ సంస్థ దక్షిణాసియా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కిషోర్ బాలాజీ, ఐబీఎం రీసెర్చ్ లాబ్స్ డైరెక్టర్ అమిత్ సింఘీ తదితరులు. ఏపీలో క్వాంటం ఏఐ యూనివర్సిటీ ఏర్పాటుపై నేషనల్ ఇన్సిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఐటీతో ఒప్పందం. దక్షిణ భారత్ లో మొట్టమొదటి ఏఐ, క్వాంటం డీమ్డ్ యూనివర్సిటీ క్యాంపస్‌ను ఏర్పాటు చేసేలా నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ ప్రణాళిక. - మిగతా2లో



# రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు విద్యుత్ రంగం మూల స్తంభం

### అసెంబ్లీలో విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్



**(అంకుశం, అమరావతి, ఫిబ్రవరి 20):**

దేశంలో విద్యుత్ సంస్కరణలకు నాంది పలికిన వ్యక్తి సీఎం చంద్రబాబు అని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ వెల్లడించారు. అసెంబ్లీలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. చంద్రబాబు విద్యుత్ సంస్కరణలతోనే ం రాష్ట్రాన్ని మిగులు విద్యుత్ రాష్ట్రంగా నిలిపాం. 2014--19లోనే రెన్యుబుల్ ఎనర్జీని 7 గిగావాట్లకు పెంచిన ఘనత సీఎం చంద్రబాబు ది. 2019--24 మధ్య కాలంలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం విద్యుత్ వ్యవస్థను సర్వనాశనం చేసింది. 9సార్లు విద్యుత్ చార్జీలు పెంచి ట్రూ అప్ చార్జీల పేరుతో రూ.30 వేల కోట్లు భారం వేశారు. రెన్యుబుల్ ఎనర్జీ పెట్టుబడిదారులను రాష్ట్రం నుంచి వైసీపీ ప్రభుత్వం తరిమి కొట్టింది. అప్పుల్లో కూరుకుపోయిన విద్యుత్ వ్యవస్థను కూటమి ప్రభుత్వం గాడిలో పెడుతోంది. దేశంలో తొలిసారి 13 పైసలు ట్రూ డౌన్ చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిది. ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ ద్వారా 160 గిగావాట్ల విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా పని చేస్తున్నాం. వ్యవసాయ, అనుబంధ రంగాలకు రోజుకు 9 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్ అందిస్తున్నాం. అన్నీ వర్గాల వినియోగదారులకు 24 గంటల నిరంతరాయ విద్యుత్ అందిస్తున్నాం. ప్రజా సంక్షేమం కోసం ఈ బడ్జెట్ లో 13 వేల కోట్లు సబ్సిడీకి కేటాయించాము. విద్యుత్ సబ్సిడీ ద్వారా 22 లక్షల మంది రైతులు ఉచిత విద్యుత్ అందిస్తున్నాం. ఆక్వా రైతుల సంక్షేమం కోసం కేవలం రూ. 1.50 కే యూనిట్ విద్యుత్ అందిస్తున్నాం. 20 లక్షల ఎస్సీ,ఎస్టీ వినియోగదారులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అమలు చేస్తున్నాం. చేనేత, దోభీ, సెలూన్లకు కూటమి ప్రభుత్వం విద్యుత్ సబ్సిడీని అందిస్తోంది. ఏప్రిల్ 1 నుంచి హ్యాండ్లూమ్ 200 యూనిట్లు, పవర్ లూమ్ కి 500 యూనిట్లు ఉచితంగా అందిస్తున్నాం. విద్యుత్ ఉత్పత్తిలో కూడా రాష్ట్రం 21,457 మెగావాట్ల ఇన్స?స్టల్డ్ కెపాసిటీతో ముందంజలో ఉంది. ఇటీవల ఏపీజెన్కో రికార్డు స్థాయిలో 6 వేల మెగావాట్ల ఉత్పత్తితో రికార్డు సాధించింది. యూనిట్ కొనుగోలు ధరను రూ.7.71 నుంచి రూ.6.35కు తగ్గించి రూ. 340 కోట్లు ఆదా చేశాం. ఎస్సీ,ఎస్టీలకు 100 శాతం సబ్సిడీతో పీఎం సూర్యఘర్ అమలు చేస్తున్నాం అని అన్నారు.

# జనాభా లెక్కల సేకరణలో కీలక పాత్ర పోషించాలి

**సెన్సస్ అధికారులకు సూచనలు చేసిన డిప్యూటీ రిజిస్ట్రార్ జనరల్**

**జనాభా లెక్కల సేకరణలో జిల్లా ప్రిన్సిపల్ సెన్సస్ అధికారులు కీలకపాత్ర పోషించాలి**




**అమరావతి,20 ఫిబ్రవరి:**

జనాభా లెక్కల సేకరణ విషయంలో జిల్లా ప్రిన్సిపల్ సెన్సస్ అధికారులైన జిల్లా కలక్టర్లు కీలకపాత్ర పోషించాలని డిప్యూటీ రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా డా.వివిఎల్ఎన్ శర్మ కోరారు. ప్రిన్సిపల్ సెన్సస్ అధికారులతో రాష్ట్రస్థాయి సమావేశం శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో జరిగింది.ఈ సమావేశంలో జనాభా లెక్కల సేకరణ--2027 కు సంబంధించిన సన్నద్ధత అంశాలు,మాస్టర్ ట్రైనర్స్,ఫీల్డు ట్రైనర్ల ఖరారు,జిల్లా సెన్సస్ అధికారులు,చార్జి అధికారులకు శిక్షణ తదితర అంశాలపై చర్చించారు. ఈసమావేశంలో రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా కార్యాలయ డిప్యూటీ రిజిస్ట్రార్ జనరల్ డా.వివిఎల్ఎన్ శర్మ మాట్లాడుతూ 2027లో నిర్వహించే జనాభా లెక్కల సేకరణ 16వది కాగా స్వాతంత్ర్యం వచ్చాక 8వది మరియు ప్రపంచంలోనే పురాతన మైన జనాభా లెక్కల సేకరణ అని పేర్కొన్నారు.రానున్న జనాభా లెక్కల సేకరణ ప్రక్రియ రెండు దశల్లో జరుగుతుందని మొదటి దశ హౌస్ లిస్టింగ్ అండ్ హౌసింగ్ సెన్సస్ (హెచ్ఎల్ఓ),రెండవ దశ పాపులేషన్ ఎన్యుమరేషన్ జరుగుతుందని తెలిపారు.ఈసారి నిర్వహించే జనాభా లెక్కల సేకరణకు ఒక ప్రత్యేకత - మిగతా2లో

# గెలుపు కాదు.. క్రీడల్లో పాల్గొడం ముఖ్యం

**ఆల్ ఇండియా పోలీస్ సౌత్ జోన్ టి20 క్రికెట్‌లో తలపడిన జట్లు**

**క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించిన హోం మంత్రి అనిత**

**డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా హాజరు**




**(అంకుశం, అమరావతి, ఫిబ్రవరి 20):**


మంగళగిరి 6వ బెటాలియన్‌లో శుక్రవారం రెండవ ఆల్ ఇండియా పోలీస్ సౌత్ జోన్ టి20 క్రికెట్ టోర్నమెంట్ పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. దాదాపు ఆరు రాష్ట్రాల నుండి 10 జట్లు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా హోం మంత్రి అనిత టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా అనిత పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఐదు రోజులు పాటు మూలపాడు గ్రౌండ్‌లో మ్యాచ్‌లు జరగనున్నాయి. ఈ సందర్భంగా హోం మంత్రి వంగలపూడి - మిగతా2లో

# ప్రయాణీకుల భద్రత, మెరుగైన సేవలే లక్ష్యం

**- బాధ్యతల స్వీకరణ అనంతరం ఆర్టీసీ ఎండీగా బాల సుబ్రహ్మణ్యం**

**(అంకుశం, అమరావతి, ఫిబ్రవరి 20):**





ప్రయాణీకుల భద్రత, మెరుగైన సేవలే లక్ష్యమని ఆర్టీసీ సంస్థ వైస్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎన్. బాల సుబ్రహ్మణ్యం వెల్లడించారు. శుక్రవారం ఆయన ఆర్టీసీ ప్రధాన కార్యాలయంలోని ఆర్టీసీ హౌస్ లో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రయాణికుల భద్రత, సమయపాలన, పరిశుభ్రత, సేవల మెరుగుదలకు అత్యున్నత ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. ప్రజా రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేయడం లక్ష్యంగా పని చేస్తామని పేర్కొన్నారు. పర్యావరణ హితమైన ఎలక్ట్రిక్ బస్సుల ప్రవేశం, సేవల సామర్థ్య వృద్ధి, ఆర్థిక స్థిరత్వం సాధనపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. సంస్థ అభివృద్ధికి అధికారులు, ఉద్యోగులు అందరూ క్రమశిక్షణతో, అంకితభావంతో కలిసి పనిచేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(అడ్మిన్) కె.ఎస్. బ్రహ్మానంద రెడ్డి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఆపరేషన్స్) ఏ. అప్పల రాజు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఇంజినీరింగ్) జి.వి.రవి వర్మ, చీఫ్ పర్సనల్ మేనేజర్ వి. శ్రీధర్, ఉన్నతాధికారులు, అధికారులు, సూపర్వైజర్లు, వివిధ అసోసియేషన్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

# చైనా, బంగ్లాలకు భారత్ చెక్


ఒకే ఒక్క కీలక ప్రాజెక్టుతో చైనా, బంగ్లాదేశ్‌లకు భారత్ చెక్ పెట్టబోతోంది. దేశంలోనే తొలిసారిగా అసోంలోని బ్రహ్మపుత్ర నది కింద ట్విన్ ట్యూబ్ అండర్ వాటర్ రోడ్ అండ్ రైల్ టన్నెల్ నిర్మాణానికి భారత్ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. మన దేశ భద్రతకు ఈ ప్రాజెక్టు అత్యంత కీలకమైంది. ఇటీవలే ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన జరిగిన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ సమావేశంలో ఈ ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఇంజినీరింగ్ ప్రొక్యూర్‌మెంట్ కన్‌స్ట్రక్షన్ (ఈపీసీ) మోడల్ కింద దాదాపు రూ.18,662 కోట్లతో ఈ టన్నెల్ ప్రాజెక్టును నిర్మించనున్నారు. పొరుగున ఉన్న చైనా, బంగ్లాదేశ్ నుంచి వచ్చే ముప్పులను ఎదుర్కోవడానికి ఇదెలా సహాయపడుతుంది ? ఈ ప్రాజెక్టు వల్ల బార్డర్‌లో భారత ఆర్మీ బలం ఎంతమేర పెరుగుతుంది? సిలిగురి కారిడార్ (చికెన్ నెక్ కారిడార్) భద్రతను ఈ టన్నెల్ ఎలా బలోపేతం చేస్తుంది? ఈశాన్య రాష్ట్రాలకు కలిగే ప్రయోజనాలేంటి? ఈ కథనంలో తెలుసుకుందాం.

**36 కి.మీ.లో 15.79 కిలోమీటర్లు నది అడుగునే**

ట్విన్ ట్యూబ్ అండర్ వాటర్ రోడ్ అండ్ రైల్ టన్నెల్ అంటే రెండు టన్నెల్స్ పక్కపక్కనే ఉంటాయి. ఒక టన్నెల్‌లోని రైలుపట్టాల మీదుగా రైళ్లు రాకపోకలు సాగిస్తాయి. మరొక టన్నెల్‌లోని రోడ్డు మీదుగా వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. బంగాల్ రాష్ట్రంలో ఉత్తర దినాజ్‌పూర్ జిల్లాలోని తీన్ మిలే హాత్ నుంచి డార్జిలింగ్ జిల్లాలోని సిలిగురి నగరానికి 11 కిలోమీటర్ల దూరంలోని రంగపాణి పట్టణం వరకు 36 కిలోమీటర్ల పరిధిలో ట్విన్ ట్యూబ్ టన్నెల్‌ను నిర్మించనున్నారు. ఈ టన్నెల్ రోడ్డు, రైలు మార్గాల్లో బంగాల్‌తో అసోం, అరుణాచల్ ప్రదేశ్, నాగాలాండ్, ఇతర ఈశాన్య రాష్ట్రాలను కనెక్ట్ చేస్తుంది. కీలకమైన విషయం ఏమిటంటే, ఈ సొరంగంలోని మొత్తం 36 కిలోమీటర్ల విస్తీర్ణంలో 15.79 కిలోమీటర్ల విభాగాన్ని అసోం రాష్ట్రంలో బ్రహ్మపుత్ర నది కింద నీటి అడుగున నిర్మిస్తారు. అసోంలో బ్రహ్మపుత్ర నది ఉత్తరం ఒడ్డున ఉన్న గోహ్‌పూర్ పట్టణం నుంచి బ్రహ్మపుత్ర నది దక్షిణం ఒడ్డున ఉన్న నుమాలీఘర్ వరకు నది కింద అండర్ వాటర్ టన్నెల్ నిర్మాణం జరగనుంది.

**రెండు జాతీయ రహదారులు, రెండు రైల్వే లైన్లు అనుసంధానం**

రోడ్ అండ్ రైల్ టన్నెల్ నిర్మించనున్న 36 కిలోమీటర్ల మార్గంలో ప్రస్తుతమున్న రెండు ట్రాక్‌ల రైల్వే లైన్‌ను నాలుగు ట్రాక్‌లుగా మారుస్తారు. ఈ టన్నెల్ ప్రాజెక్టు ఎన్‌హెచ్-15, ఎన్‌హెచ్-715 జాతీయ రహదారులతో పాటు, రెండు రైల్వే లైన్లకు కలుపుతుంది. నార్త్ ఈస్ట్ ఫ్రాంటియర్ రైల్వే జోన్ పరిధిలోని రంగియా డివిజన్‌లో గోహ్‌పూర్ వైపునున్న రంగియా-ముకోంగ్సెలెక్ రైల్వే లైన్, తీన్‌సుకియా డివిజన్‌లో



నుమాలీఘర్ వైపునున్న ఫుర్కేటింగ్-మరియాని లూప్ లైన్‌లను ఈ ప్రాజెక్టు కనెక్ట్ చేస్తుంది.

**240 కి.మీ దూరం 34 కి.మీకు తగ్గిపోతుంది!**

ప్రస్తుతం జాతీయ రహదారి మార్గంలో అసోంలోని నుమాలీఘర్ – గోహ్‌పూర్ పట్టణాల మధ్య 240 కిలోమీటర్ల దూరం ఉంది. ఈ దూరాన్ని వాహనంలో ప్రయాణించడానికి సగటున 6 గంటల టైం పడుతుంది. అండర్ వాటర్ రోడ్, రైల్ టన్నెల్ అందుబాటులోకి వచ్చాక నుమాలీఘర్, గోహ్‌పూర్ మధ్య కేవలం 34 కిలోమీటర్ల దూరమే ఉంటుంది. నుమాలీఘర్ నుంచి గోహ్‌పూర్‌కు 20 నిమిషాల్లోనే వెళ్లొచ్చు.

**బ్రహ్మపుత్ర తీరప్రాంతం దశ తిరుగుతుంది!**

అసోంలోని నుమాలీఘర్ అనేది ప్రధాన పారిశ్రామిక కేంద్రం. నుమాలీఘర్ రిఫైనరీ లిమిటెడ్ అనే ప్రభుత్వరంగ చమురు కంపెనీ అక్కడ కార్యకలాపాలు నిర్వహిస్తోంది. నుమాలీఘర్, గోహ్‌పూర్‌ల మధ్య రైల్, రోడ్ కనెక్టివిటీ పెరిగితే అసోం రాష్ట్రంలో ఉపాధి అవకాశాలు, వ్యాపార వికాసం రెక్కలు తొడుగుతాయి. అండర్ వాటర్ రోడ్, రైల్ టన్నెల్ అనేది అసోంలోని 11 ఆర్థిక కేంద్రాలు, 3 సామాజిక కేంద్రాలు, 2 పర్యాటక కేంద్రాలు, 8 లాజిస్టిక్స్ కేంద్రాలను కలుపుతుంది. రాష్ట్రంలోని 4 ప్రధాన రైల్వే స్టేషన్లు, 2 విమానాశ్రయాలు, 2 లోతట్టు జలమార్గాలకు మెరుగైన కనెక్టివిటీని అందిస్తుంది. దీనివల్ల వస్తు,ఉత్పత్తులు, ప్రయాణికుల రాకపోకలు వేగవంతం అవుతాయి. మొత్తంమీద ఈ టన్నెల్ ప్రాజెక్ట్ అసోం పరిధిలో దాదాపు 80 లక్షల రోజుల ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలను సృష్టిస్తుంది. అసోం సహా ఈశాన్య రాష్ట్రాల్లో వరదలు, ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు వేగంగా సహాయక సామాగ్రిని, రెస్క్యూ టీమ్‌లను తరలించే వీలు కలుగుతుంది.

**చైనా, బంగ్లాదేశ్‌లకు చెక్- భారత సైన్యానికి కొత్తమార్గాలు**

ట్విన్ ట్యూబ్ అండర్ వాటర్ రోడ్ అండ్ రైల్ టన్నెల్ బంగ్లాదేశ్ సరిహద్దులోని రెండు సైనిక స్థావరాల దాకా వెళుతుంది. ఆ స్థావరాలకు శరవేగంగా సైనికులు, ఆయుధాలను చేరవేసే వీలు కలుగుతుంది.

బంగ్లాదేశ్ సరిహద్దు సమీపంలో మరో మూడు కొత్త సైనిక స్థావరాలను భారత సైన్యం నిర్మిస్తోంది. వీటిలో ఒకటి బిహార్‌లోని కిషన్‌గంజ్‌లో, మరొకటి బంగాల్‌లోని చోప్రాలో, ఇంకొకటి అసోంలోని ధుబ్రిలో ఉన్నాయి.

వీటికి చేరువగా ఈ రైలు-రోడ్డు మార్గం వెళుతుంది. నేపాల్, భూటాన్, బంగ్లాదేశ్‌ల అంతర్జాతీయ సరిహద్దులు ఈ రైలు-రోడ్డు సొరంగ మార్గానికి చాలా దగ్గరగా ఉంటాయి. సైనిక ఘర్షణలు తలెత్తితే, ఈ టన్నెల్ మార్గంలో వేగంగా మూడు దేశాల సరిహద్దుల సమీపం వరకు భారత్ ఆయుధాలు, సైనికులను తరలించగలదు.

బంగాల్‌లోని సిలిగురి కారిడార్‌ను చికెన్ నెక్ కారిడార్ అంటారు. ఇది నేపాల్, భూటాన్, బంగ్లాదేశ్, చైనాలోని చుంబీ లోయలకు అత్యంత సమీపంలో ఉంటుంది. సిలిగురి నగరం పరిధిలోని బాగ్ డోగ్రా విమానాశ్రయం సమీపం నుంచే ఈ టన్నెల్‌ను నిర్మించనున్నారు.

బంగాల్‌లోని సిలిగురి సమీపంలోనే భారత సైన్యానికి బెంగ్‌డుబి సైనిక స్థావరం ఉంది. సిలిగురి కారిడార్ భద్రతకు ఇది కీలకమైంది. ఈ సైనిక స్థావరానికి కూడా చేరువగానే రోడ్ – రైల్ టన్నెల్ ఉంటుంది

బంగాల్‌లోని సుక్నాలో భారత ఆర్మీకి చెందిన 33వ కార్ప్స్ ప్రధాన కార్యాలయం ఉంది. దీన్నే త్రిశక్తి కార్ప్స్ అంటారు. ఇది కూడా టన్నెల్‌కు చేరువగానే ఉంటుంది. అత్యవసరాలు, యుద్ధ పరిస్థితుల్లో త్రిశక్తి కార్ప్స్ దళాలు ఈ టన్నెల్ మీదుగా రైళ్లు, వాహనాల ద్వారా సరిహద్దుల దాకా చేరుకోగలుగుతారు.

ప్రపంచంలో నీటి అడుగున రైల్వే సొరంగాలు ఎక్కడున్నాయి? డెన్మార్క్, స్వీడన్ దేశాలు భారత్ కంటే ముందే నీటి అడుగున రోడ్ కమ్ రైల్ టన్నెల్‌ను నిర్మించాయి. నీటి అడుగున నిర్మించిన అతి పొడవైన రైల్వే సొరంగంగా ఓరెసుండ్ టన్నెల్ రికార్డును సాధించింది. దీని మొత్తం పొడవు 16 కి.మీ. ఇందులో దాదాపు 4 కి.మీ భాగాన్ని సముద్రం కింద నిర్మించారు. ఈ టన్నెల్ డెన్మార్క్‌లోని కోపెన్ హగెన్ నగరాన్ని, స్వీడన్‌లోని మాల్మో నగరంతో అనుసంధానిస్తుంది. 2000 సంవత్సరంలోనే దీని నిర్మాణం పూర్తయింది. ఈ టన్నెల్‌లో మొత్తం 5 ట్యూబ్‌లు ఉన్నాయి. వీటిలోని రెండు ట్యూబ్‌లలో నాలుగు లేన్ల రోడ్లు ఉన్నాయి. మిగతా రెండు ట్యూబ్‌లలో రైళ్లు రాకపోకలు సాగిస్తాయి. ఇంకొక ట్యూబ్‌లను అత్యవసరాల కోసం సిద్ధంగా ఉంచారు. ఈ సొరంగంలో వెంటిలేషన్, లైటింగ్, అధునాతన సెక్యూరిటీ ఫీచర్స్ ఉన్నాయి. అసోంలో బ్రహ్మపుత్ర నది కింద టన్నెల్ నిర్మాణం పూర్తయ్యాక భారత్ పేరు కూడా డెన్మార్క్, స్వీడన్ లాంటి దేశాల సరసన చేరనుంది.

# ఏఐ ఫలాలను ప్రతి ఒక్కరికి, ప్రతిచోటుకు చేరవేద్దాం

'ఇది వేగవంతమైన పురోగతి, కొత్త ఆవిష్కరణల యుగం'అని గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ అన్నారు. అయితే వీటితో అత్యుత్తమ ఫలితాలే వస్తాయని కచ్చితంగా చెప్పలేమని ఆయన అభిప్రాయపడ్డారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) లాంటి కొత్త ఆవిష్కరణలతో అత్యుత్తమ ఫలితాలను సాధించేందుకు అందరూ కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ఏఐ ఫలాలు ప్రతి ఒక్కరికి, ప్రతిచోటుకు చేరేలా చేయాల్సిన బాధ్యత మనపై ఉందని సుందర్ పిచాయ్ పేర్కొన్నారు. అమెరికా సారథ్యంలోని టెక్ కూటమి 'పాక్స్ సిలికా'లో భారత్ చేరికపై దిల్లీలో ఏర్పాటుచేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. భారత్, అమెరికాల మధ్య టెక్ భాగస్వామ్యం అత్యంత కీలకమైందన్నారు. 'పాక్స్ సిలికా' కూటమిలోకి భారత్ చేరనున్న నేపథ్యంలో ఆ కూటమిలోని అన్ని దేశాలకు పిచాయ్ అభినందనలు తెలిపారు. అమెరికా సారథ్యంలోని 'పాక్స్ సిలికా' కూటమిలో చేరిక వల్ల ఏఐ టెక్నాలజీ, సెమీ కండక్టర్లు, అరుదైన ఖనిజ నిక్షేపాలతో ముడిపడిన అంతర్జాతీయ సప్లై చైన్లకు భద్రత, రక్షణ లభిస్తాయన్నారు.

**భారత ప్రభుత్వంతో కలిసి ఏఐ యాప్స్ తెస్తాం**

'ఏఐ విభాగంలో భారత్ అసాధారణమైన భవిష్యత్తును చూడబోతోంది. ఇందుకోసం మేం కూడా పూర్తి సహకారాన్ని అందిస్తాం. కొత్త ప్రోడక్ట్స్, సామర్థ్యం పెంపు, మౌలిక వసతుల పెంపు ద్వారా చేయూతను అందిస్తాం. భారతీయ కస్టమర్లు, వ్యాపారాలు, డెవలపర్ల కోసం ఏఐ ప్రోడక్ట్స్, సాఫ్ట్‌వేర్లను తయారు చేసే దిశగా ప్రస్తుతం కసరత్తు చేస్తున్నాం. ఏఐ కోచ్ సాఫ్ట్‌వేర్ కోసం 22 గెమ్మా ఓపెన్ సోర్స్ లార్జ్ ల్యాంగ్వేజ్ మోడల్స్‌ను ఇప్పటికే విడుదల చేశాం' 'కొత్త ఏఐ ప్రోడక్ట్స్ అభివృద్ధి విషయంలో మేం భారత ప్రభుత్వంతోనూ కలిసి



పనిచేస్తున్నాం. రైతులకు సకాలంలో వాతావరణ సూచనలను అందించే, రోగుల్లో డయాబెటిక్ రెటినోపతిని గుర్తించే ఏఐ యాప్‌లను ప్రభుత్వంతో కలిసి తీసుకురాబోతున్నాం. వీలైనన్ని ఎక్కువ భారతీయ భాషల్లో ఈ యాప్‌లు అందుబాటులోకి తేవాలని లక్ష్యంగా పెట్టుకున్నాం' అని గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ తెలిపారు.

**ఆ ఫీచర్లను భారత్‌లోనే ఎక్కువ వినియోగిస్తున్నారు**

'సర్కిల్ టు సెర్చ్, లెన్స్ లాంటి గూగుల్ స్కామ్ డిటెక్షన్ ఫీచర్లను ప్రపంచంలో ఎక్కువగా భారత్‌లోనే వినియోగిస్తున్నారు. జెమిని యాప్ వినియోగం యావత్ ప్రపంచంలో శరవేగంగా పెరుగుతోంది. ఆ యాప్ 10 భారతీయ భాషల్లో అందుబాటులో ఉంది. ఎంతోమంది భారతీయ కంటెంట్ క్రియేటర్లు యూట్యూబ్ ద్వారా ప్రపంచానికి భారతీయ సంగీతం, కళలు, సంస్కృతిని చూపిస్తున్నారు' 'భారతీయులకు ఏఐ స్కిల్స్‌ను నేర్పడంపైనా మేం ఫోకస్ పెట్టాం. ఇందుకోసం గూగుల్ ఏఐ స్కిల్స్ ప్రోగ్రాం నడుస్తోంది. కోటిమంది భారతీయులకు ఏఐ టూల్స్‌పై అవగాహన కల్పించాలని మేం టార్గెట్‌గా పెట్టుకున్నాం. విద్యార్థులు, కొత్తగా టెక్ ప్రొఫెషన్స్‌లోకి ఎంటరయ్యే వారికి గూగుల్ ఏఐ సర్టిఫికెట్లను జారీ చేసేందుకు మేం వాధ్వానీ ఏఐ కంపెనీతో కలిసి పనిచేస్తున్నాం. ఈ వారం ఆరంభంలోనే దీనిపై నిర్ణయం జరిగింది' అని గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ చెప్పారు.

**సముద్ర గర్భ ఫైబర్ ఆప్టిక్ కేబుల్స్‌కు గేట్‌వేగా విశాఖపట్టణం**

'భారత్‌లోనే తొలి ఫుల్ స్టాక్ ఏఐ హబ్‌ను ఆంధ్రప్రదేశ్‌లోని వైజాగ్‌లో ఏర్పాటు చేయబోతున్నాం. ఇందుకోసం రూ.1.36 లక్షల కోట్ల పెట్టుబడి పెడతాం. ఆ ఏఐ హబ్ సామర్థ్యం గిగావాట్ల స్థాయిలో ఉంటుంది. దానివల్ల దేశవ్యాప్తంగా ప్రజలకు ఉద్యోగాలు, ఏఐ టెక్నాలజీ ఫలాలు, కొత్త వ్యాపార అవకాశాలు లభిస్తాయి. భారత్, అమెరికాల మధ్య డిజిటల్ ట్రేడ్ రూట్ల ఏర్పాటులోనూ గూగుల్ కీలక పాత్ర పోషిస్తుంది. ఇరుదేశాల నడుమ వారధిగా పనిచేస్తుంది. అందుకోసం విశ్వసనీయమైన డిజిటల్ ప్రోడక్ట్స్, సముద్రగర్భ కేబుల్స్, ఏఐ హబ్‌లు అవసరం' 'ఇండియా- అమెరికా కనెక్ట్ కార్యక్రమాన్నీ మేం ఇప్పటికే ప్రకటించాం. దీనిలో తొలి ప్రధాన అంతర్జాతీయ సముద్ర గర్భ గేట్‌వేగా విశాఖపట్నం నిలుస్తుంది. వైజాగ్ నుంచి సింగపూర్, దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా దేశాల వరకు సముద్ర గర్భ ఫైబర్ ఆప్టిక్ కేబుల్స్ కనెక్ట్ అవుతాయి. ముంబయి టు పశ్చిమ ఆస్ట్రేలియా వరకూ సముద్ర గర్భ కేబుల్స్ ఏర్పాటు అవుతాయి. కొత్తగా అమెరికా ఏర్పాటు చేసిన పాక్స్ సిలికా కూటమి ఈవిధమైన సప్లై చైన్ల భద్రతకు హామీ ఇస్తోంది' అని గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ వివరించారు.

# రిటైర్ అవుతారా? రిటర్న్ అవుతారా?- రాజ్యసభ పోల్స్ వేళ శరద్ పవార్ ప్లాన్ ఏంటి?

మహారాష్ట్ర రాజకీయాల్లో మరో కీలక పరిణామం జరగబోతోం దనే సంకేతాలు కనిపిస్తున్నాయి. లేదు లేదు, కాదు కాదు అంటూనే రాజ్యసభ ఎన్నికల బరిలోకి దిగేందుకు ఎన్‌సీపీ (ఎస్‌పీ) అధినేత శరద్ పవార్ రెడీ అవుతున్నారనే టాక్ వినిపిస్తోంది. రాష్ట్ర రాజకీయాల్లో విస్తృతమైన పరిచయాలతో పాటు సుదీర్ఘ అనుభవం, జాతీయ స్థాయిలో పేరు కలిగిన 85 ఏళ్ల శరద్ పవార్‌ను రాజ్యసభకు పంపాలని యోచిస్తోంది. మహారాష్ట్రలోని 7 రాజ్యసభ సీట్లకు మార్చి 16న ఎన్నికలు జరగనున్నాయి. రాష్ట్రంలోని ఎమ్మెల్యేల సంఖ్యాబలం పరంగా మహా వికాస్ అఘాడీ (ఎంవీఏ) కూటమి ఒకే ఒక్కరిని రాజ్యసభకు పంపగలుగుతుంది. ఆ ఒక్క అవకాశాన్ని శరద్ పవార్ పొందబోతున్నారనే చర్చ జరుగుతోంది. అయితే దీన్ని కాంగ్రెస్‌లోని ఓ వర్గం వ్యతిరేకిస్తోంది.

**వరుసగా మూడోసారి రాజ్యసభకు శరద్ పవార్**

రాజ్యసభకు వెళ్లాలనే కోరిక తనకు లేదని శరద్ పవార్ ఇంతకుముందే పలుమార్లు స్పష్టం చేశారు. అయితే, అజిత్ పవార్ మరణంతో రాష్ట్ర రాజకీయ సమీకరణాలు మారిన దృష్ట్యా ఆయన రాజ్యసభకు వెళ్లేందుకు మొగ్గుచూపుతారనే అంచనాలు వెలువడుతున్నాయి. తన పార్టీ ఎన్‌సీపీ (ఎస్‌పీ) కోసం కాకుండా, ప్రతిపక్ష ఎంవీఏ కూటమి భవిష్యత్తు కోసం రాజ్యసభ ఎన్నికల బరిలోకి దిగేందుకు శరద్ పవార్ సిద్ధం అవుతున్నారనే ప్రచారం జరుగుతోంది. గత ఆరు దశాబ్దాలుగా రాజకీయాల్లో ఉన్న శరద్ పవార్, ఇప్పటివరకు కేవలం రెండుసార్లే రాజ్యసభకు ప్రాతినిధ్యం వహించారు. 2014లో భారత రాజకీయాల్లో బీజేపీ ప్రభంజనం మొదలయ్యాక, శరద్ పవార్ రాజ్యసభ ఎన్నికల్లో పోటీ చేయాల్సిన అనివార్య పరిస్థితి ఏర్పడింది. ఈవిధంగా 2014, 2020లో రాజ్యసభకు ఆయన ఎన్నికయ్యారు. ప్రస్తుతం రాజ్యసభ సభ్యుడిగా ఉన్న శరద్ పవార్ పదవీకాలం 2026 ఏప్రిల్?తో ముగియనుంది. దీంతో వరుసగా మూడోసారి ఆయన్ను రాజ్యసభకు పంపి, జాతీయస్థాయిలో ప్రతిపక్ష ఇండియా కూటమి వాణిని బలోపేతం చేయాలని విపక్షాలు భావిస్తున్నాయి. రాజ్యసభ ఎన్నికల షెడ్యూల్‌ను ఫిబ్రవరి 18వ తేదీన కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేసింది. మహారాష్ట్రలో మొత్తం 288 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. రాజ్యసభ ఎన్నికల్లో ఒక సీటును గెలవాలంటే కనీసం 37 మంది ఎమ్మెల్యేల మద్దతు అవసరం. ప్రస్తుతం ప్రతిపక్ష మహా వికాస్ అఘాడీ కూటమిలో శరద్ పవార్ ఎన్‌సీపీ, కాంగ్రెస్, ఉద్ధవ్ శివసేన ఉన్నాయి. ఈ కూటమికి 50 మంది ఎమ్మెల్యేల బలం ఉంది. అత్యధికంగా ఉద్ధవ్ శివసేనకు 20 మంది, కాంగ్రెస్‌కు 16 మంది, శరద్ ఎన్‌సీపీకి 10 మంది, సమాజ్ వాదీ పార్టీకి ఇద్దరు, పీజాంట్స్ అండ్ వర్కర్స్, సీపీఐ పార్టీలకు చెరొక ఎమ్మెల్యేలు ఉన్నారు. 7 రాజ్యసభ సీట్లకు ఎన్నికలు జరగనున్నాయి. వీటిలో ఒకే ఒక సీటును గెలిచే బలం మహా వికాస్ అఘాడీ కూటమికి ఉంది. ఇటీవలి కాలంలో శరద్ పవార్ ఎన్‌సీపీ, బీజేపీ మధ్య పెరుగుతున్న సాన్నిహిత్యంపై రాజకీయ వర్గాల్లో హాట్ డిబేట్ నడుస్తోంది. శరద్ పవార్ ఎన్‌సీపీ భవిష్యత్తులో బీజేపీలో విలీనం అవుతుందనే ఆందోళన కాంగ్రెస్‌లోని ఒక వర్గం నేతల్లో వ్యక్తమవుతోంది. ఈ రాజ్యసభ ఎన్నికల్లో విపక్ష ఎంవీఏ కూటమికి లభించే ఒక్కగానొక్క రాజ్యసభ సీటును శరద్ పవార్‌కే కేటాయిస్తే,

## దిగ్గజ సంస్థ ప్రతినిధులతో సమావేశాలు.. పలు ఒప్పందాలు

-మొదటిపేజీ తరువాయి

కేంద్రం నుంచి మౌలిక సదుపాయాలకు నిధులు, రాష్ట్ర ప్రభుత్వం నుంచి భూమి, క్వాంటం హార్డ్‌వేర్ సమకూర్చేలా ఒప్పందం. అమరావతిని క్వాంటం కంప్యూటింగ్ లో నేషనల్ హబ్ గా తీర్చిదిద్దేలా కార్యాచరణ. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్న డైరెక్టర్ జనరల్ డాక్టర్ మదన్ మోహన్ త్రిపాఠి, కంట్రోలర్ జనరల్ డాక్టర్ అలోక్ త్రిపాఠి తదితరులు. రాష్ట్ర స్థాయి ఏఐ టెక్ హబ్-5 లేయర్డ్ స్వదేశీ ఏఐ స్టాక్ నిర్మించేలా భారత్ జెన్-నెక్స్ జెన్-ఐబీఎంలతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం. ప్రభుత్వంలోని వివిధ సంస్థలకు సేవలందించడంతోపాటు 22 భారతీయ భాషలను అనుసంధానించేలా ప్లాట్ ఫామ్ ఏర్పాటుపై ఎంఓయూ. ఒప్పందం కార్యక్రమంలో పాల్గోన్న భారత్ జెన్ సీఈఓ హిషికేష్ మోహల్ బాల్, ప్రతినిధి రామకష్ణన్ లు నెక్స్ జెన్ సీఈఓ రాజగోపాల్, ఐబీఎం రీసెర్చ్ ల్యాబ్స్ డైరెక్టర్ అమిత్ సింఘీ. ఏపీలోని 50 ఉన్నతవిద్యా సంస్థల్లో ఏఐ, క్వాంటం టెక్నాలజీని బలోపేతం చేసేలా ఏఐ అకాడెమీ, ఏఐ శాండ్ బాక్స్ ఏర్పాటు చేసేందుకు ఏపీతో ఒప్పందం చేసుకున్న కాలిబో ఏఐ సంస్థ. గ్రాడ్యుయేట్లు, పీజీ విద్యార్థులకు అవగాహన, ఫ్యాకల్టీ డెవలప్మెంట్ కోసం ఏఐ శాండ్ బాక్స్-ఇన్నోవేషన్ ల్యాబ్స్ ఏర్పాటు చేసేలా ఎంఓయూ. ఏఐ ఇంటిగ్రేటెడ్ కరిక్యులమ్, నైపుణ్య శిక్షణ వంటి అంశాలపై దష్టి సారించేలా ఎంఓయూ. ఈ ఎంఓయూలో పాల్గొన్న రాజ్ వట్టికూటి, అరబిందో సాహూ, విపుల్ వలంజీ, పింటో జోయ్సన్, జోహన్నెస్ ష్రోడర్ తదితరులు. అమరావతి క్వాంటం వ్యాలీలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు కోసం రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్న వైజర్ సంస్థ. ఈ ఏడాది చివరి నాటికి 3.50 లక్షల మంది ఏఐ-క్వాంటం లెర్నర్లు, 2027 నాటికి 6 లక్షల మందిని సిద్ధం చేసేలా వైజర్ సంస్థ ఒప్పందం. ఈ ఎంఓయూలో క్వాంటం సొల్యూషన్స్ హెడ్ వర్ధన్ సెహగల్, రాజ్ వట్టికూటి బందం. ఏపీలో ఏఐ ట్యూటర్ ఏర్పాటు అంశంపై ఐఐటీ మద్రాస్ తో ఒప్పందం చేసుకున్న రాష్ట్ర ప్రభుత్వం. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాల విద్యార్థుల కోసం ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ట్యూటర్ ను అందుబాటులోకి తీసుకువచ్చేలా ఎంఓయూ. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఐఐటీ మద్రాస్ డైరెక్టర్ ప్రొఫెసర్ కామకోటి, ప్రొఫెసర్ మితేష్ తదవతరులు పాల్గొన్నారు.

## జనాభా లెక్కల సేకరణలో కీలక పాత్ర పోషించాలి

-మొదటిపేజీ తరువాయి

ఉందని మొట్టమొదటి సారిగా డిజిటల్ విధానంలో జనాభా లెక్కల సేకరణ ప్రక్రియను చేపట్టడం జరుగుతుందని చెప్పారు.ముఖ్యంగా తెలుగు రాష్ట్రాలకు సంబంధించి క్షేత్ర స్థాయిలో డిజిటల్ అక్షరాస్యత చాలా బాగుందని కావున ఖచ్చితంగా ఉత్తమ డేటాను సేకరించడానికి వీలు కలుగుతుందని డా.శర్మ పేర్కొన్నారు.జనాభా గణన డేటా ప్రణాళిక, విధాన అభివద్ధి మరియు సమాజ అవసరాలను అర్థం చేసుకోవడానికి కీలక మైనదిగా ఆయన చెప్పారు.అంతేగాక ఖచ్చితమైన ప్రణాళిక మరియు వనరుల కేటాయింపు కోసం ప్రక్రియ చాలా ముఖ్యమైనదని చెప్పారు.జనాభా గణన విజయవంతం అనేది అంకిత భావంతో పాల్గొనడంపై ఎక్కువగా ఆధారపడి ఉంటుందన్నారు.అంతేగాక డేటా సేకరణ కోసం నియమించబడే ఎన్యూమరేటర్లు మరియు సూపర్‌వైజర్లకు సమర్థవంతమైన శిక్షణపై కూడా ఆధారపడి ఉంటుందని పేర్కొన్నారు.జనాభా లెక్కల సేకరణ విజయవంతం అనేది సేకరించే డేటాను బట్టి ఉంటుందని చెప్పారు.జనాభా లెక్కల సేకరణకు సంబంధించి ఇప్పటికే రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా నుండి పలు ఆదేశాలు జారీ చేయడం జరిగిందని డా.శర్మతెలిపారు. 2027 జనాభా లెక్కల సేకరణకు ఒక ప్రత్యేకత ఉందని డిజిటల్ రూపంలో జనాభా లెక్కల సేకరణతో పాటు వెబ్ పోర్టల్ ద్వారా ప్రజలు సహితం వ్యక్తిగతంగా సెల్ఫ్ ఎన్యుమరేట్ చేసుకునేందుకు వీలుందని డిప్యూటీ రిజిస్ట్రార్ జనరల్ డా.శర్మ వెల్లడించారు.జనాభా లెక్కల సేకరణ విషయంలో ప్రిన్సిపల్ సెన్సస్ అధికారులు కీలకపాత్ర పోషించాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఈసమావేశంలో జనాభా లెక్కల సేకరణ రాష్ట్ర నోడలు అధికారి మరియు ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్.ఎస్.రావత్ మాట్లాడుతూ ఈసారి జనాభా లెక్కల సేకరణ ప్రక్రియను డిజిటల్ విధానంలో చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు.అందుకు అనుగుణంగా మొబైల్ అప్లికేషన్,వెబ్ పోర్టల్ ను రూపొందించడం జరిగిందని తెలిపారు.వివిధ శాఖల సమన్వయంతో ఖచ్చితమైన వివరాలతో కూడిన జనాభా లెక్కల సేకరణకు అన్ని విధాలా కషి చేయడం జరుగుతుందని అన్నారు.జిల్లా ప్రిన్సిపల్ సెన్సస్ అధికారులుగా జిల్లా కలక్టర్లు, మున్సిపల్ కార్పొరేషన్లలో మున్సిపల్ కమీషనర్లు ప్రత్యేక బాధ్యతగా జనాభా లెక్కల సేకరణ ప్రక్రియను విజయవంతంగా చేపట్టేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ సెన్సస్ జె.నివాస్ మాట్లాడుతూ దేశంలో మొదటి సారిగా డిజిటల్ విధానంలో జనాభా లెక్కల సేకరణకు భారత ప్రభుత్వం చర్యలు చేపట్టిందని కావున రాష్ట్రంలో విజయవంతంగా జనాభా లెక్కల సేకరణకు ప్రిన్సిపల్ సెన్సస్ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.ఇందుకు సంబంధించి అన్ని జిల్లాలకు అవసరమైన మార్గదర్శకాలను జారీ చేయడం జరిగిందని వివరించారు. ఈసమావేశంలో రాష్ట్ర స్థాయి సెన్సస్ కోఆర్డినేషన్ కమిటీ సభ్యులు తరపున సిడిఎంఏ జి.సంపత్ కుమార్,కమీషనర్ సర్వే అండ్ సెటిల్మెంట్స్ అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఆర్.కూర్మనాథ్, స్వర్ణ గ్రామ,వార్డుల డైరెక్టర్ శివ ప్రసాద్,జిల్లా సెన్సస్ అధికారులైన జిల్లా కలక్టర్లు,వివిధ మున్సిపల్ కార్పొరేషన్ల ప్రిన్సిపల్ సెన్సస్ అధికారులైన మున్సిపల్ కమీషనర్లు,జేసిలు, డిఆర్‌ఓలు,అదనపు కమీషనర్లు,డిప్యూటీ కమీషనర్లు,రాష్ట్ర సెన్సస్ డైరెక్టర్ కార్యాలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గెలుపు కాదు.. క్రీడల్లో పాల్గొడం ముఖ్యం

-మొదటిపేజీ తరువాయి

అనిత మాట్లాడుతూ.. పోలీసులు అనునిత్యం విధులు నిర్వహిస్తూ ఉంటారు. ప్రజా భద్రత కోసం 24 గంటలు పోలీసులు పని చేస్తారు. పోలీసులకు ఇలాంటి క్రీడలు నిర్వహించడం చాలా సంతోషం. పోలీసులకు క్రీడల నిర్వహించడం వలన, వారిలో ఐక్యత పెరుగుతుంది. అమరావతి అంటేనే ప్రజల రాజధాని. అమరావతి రాజధానిని ప్రపంచ రాజధానిగా మార్చడానికి సీఎం చంద్రబాబు ఎంతో కషి చేస్తున్నారు. క్రీడా స్ఫూర్తిని పెంపొందించడానికి ఈ క్రీడలు ఎంతగానో దోహదపడతాయి. క్రీడల్లో పాల్గొడం ముఖ్యం. గెలుపు ముఖ్యం కాదు అని హోం మంత్రి అనిత పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీ డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, ఐజీపీ స్పోర్ట్స్ కే.వి. మోహన్ రావు, డీఐజీ వెల్ఫేర్ అండ్ స్పోర్ట్స్ కేకేఎన్ అనుబు రాజన్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## టోల్ ప్లాజాల్లో నగదు చెల్లింపులు బంద్

జాతీయ రహదారులపై ప్రయాణించే వారికి ఇది అత్యంత కీలకమైన అప్‌డేట్. దేశవ్యాప్తంగా ఉన్న టోల్ ప్లాజాల్లో నగదు రూపంలో రుసుము చెల్లించే విధానానికి స్వస్తి పలకాలని కేంద్ర ప్రభుత్వం గట్టిగా యోచిస్తోంది. అన్నీ అనుకున్నట్లు జరిగితే, 2026 ఏప్రిల్ 1వ తేదీ నుంచి టోల్ ప్లాజాల వద్ద నగదు చెల్లింపులు పూర్తిగా రద్దు కానున్నాయి. ఆ తర్వాత టోల్ రుసుములను కేవలం ఫాస్టాగ్ లేదా యూపీఐ వంటి డిజిటల్ మార్గాల ద్వారానే చెల్లించాల్సి ఉంటుంది. ఈ మేరకు రోడ్డు రవాణా మరియు రహదారుల మంత్రిత్వ శాఖ సంకేతాలు ఇచ్చింది. ఎలక్ట్రానిక్ టోల్ కలెక్షన్ వ్యవస్థను మరింత బలోపేతం చేసి, టోలింగ్ ప్రక్రియను అత్యంత సమర్థవంతంగా, పారదర్శకంగా మార్చడమే ఈ ప్రతిపాదన ముఖ్య ఉద్దేశమని ప్రభుత్వం స్పష్టం చేసింది. గత కొన్నేళ్లుగా ఫాస్టాగ్ వినియోగం అనూహ్యంగా పెరిగింది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 98 శాతానికి పైగా వాహనదారులు ఫాస్టాగ్ ద్వారానే టోల్ చెల్లిస్తున్నారు. ఈ విజయమే నగదు రహిత విధానం వైపు అడుగులు వేయడానికి ప్రభుత్వానికి ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చింది. ఫాస్టాగ్‌తో పాటు, దేశంలోని అన్ని టోల్ ప్లాజాల్లో యూపీఐ ద్వారా చెల్లించే సౌకర్యం కూడా అందుబాటులో ఉంది. ఇది ప్రయాణికులకు తక్షణ చెల్లింపునకు మరో మార్గాన్ని అందిస్తోంది. ప్రస్తుతం, వాహనం విండ్‌స్క్రీన్‌పై అతికించిన ఫాస్టాగ్ స్టిక్కర్ ద్వారా టోల్ ప్లాజా వద్ద ఆగకుండానే రుసుము ఆటోమేటిక్‌గా ఖాతా నుంచి కట్ అవుతోంది. ఈ విధానం దేశంలోని అన్ని జాతీయ రహదారులతో పాటు, 100కి పైగా రాష్ట్ర రహదారుల టోల్ ప్లాజాల్లో విజయవంతంగా అమలవుతోంది. ఇప్పటికే ప్రభుత్వం డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకుంటోంది. ఫంక్షనల్ ఫాస్టాగ్ ఉండి కూడా నగదు చెల్లిస్తే రెట్టింపు రుసుము, యూపీఐ ద్వారా చెల్లిస్తే 1.25 రెట్లు రుసుము వసూలు చేస్తున్నారు. తాజా ప్రతిపాదన అమలైతే, టోల్ ప్లాజాల వద్ద వాహనాల రద్దీ, ట్రాఫిక్ జామ్‌లు గణనీయంగా తగ్గుతాయి. ప్రయాణికులకు విలువైన సమయం ఆదా అవుతుంది. టోల్ ఆపరేటర్లకు నిర్వహణ ఖర్చులు తగ్గడంతో పాటు, టోల్ వసూళ్లలో ఆడిట్ నియంత్రణ మరింత సులభతరం అవుతుంది.

# వెంకన్న ఆగ్రహానికి గురికాక తప్పదు

## – జగన్ కు, వైసీపీ సభ్యులకు మంత్రి సవిత హెచ్చరిక

**అంకుశం ప్రతినిధి అమరావతి : ఫిబ్రవరి 20:** హిందువుల మనోభావాలు దెబ్బతినేలా శాసనమండలిలో వైసీపీ సభ్యులు వ్యవహరించిన తీరుపై రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. వెంకన్న ఫొటోలను సభలో విచ్చలవిడిగా పడేసి అపచారానికి పాల్పడ్డారని, ఆ కలియుగ దైవం ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. తక్షణమే హిందువులకు, ప్రజలకు జగన్, వైసీపీ సభ్యులు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. శుక్రవారం అసెంబ్లీ ఆవరణలో తనను కలిసిన విలేకరులతో మంత్రి సవిత మాట్లాడారు. శాసనమండలిలో వైసీపీ సభ్యులు వ్యవహరించిన తీరు గర్హనీయమన్నారు. కలియుగ దైవం వెంకన్న స్వామి ఫొటోలతో రాజకీయం చేయడం క్షమించరాని నేరమన్నారు. తెలుగు జాతి ఇలవేల్పు వెంకటేశ్వర స్వామి ఫొటోలతో ఉన్న ప్లకార్డులను మండలిలో ఇష్టారాజ్యంగా పడేసి మహా అపచారానికి పాల్పడ్డారని ఆగ్రహం వ్యక్తంచేశారు. జగన్ రెడ్డి సూచన మేరకే తమ రాజకీయాల కోసం శాసన మండలిలో వెంకన్న స్వామి ఫొటోలను వైసీపీ సభ్యులు వాడుకున్నారని మండిపడ్డారు. వారంతా హిందువుల మనోభావాలు దెబ్బతినేలా వ్యవహరించారని, తక్షణమే హిందూ సమాజానికి జగన్, వైసీపీ ఎమ్మెల్సీలు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. వెంకన్న ఆగ్రహానికి జగన్ , వైసీపీ సభ్యులు గురికాక తప్పదని మంత్రి సవిత హెచ్చరించారు.



### నీచానికి దిగజారిన వైసీపీ

మహిళలన్నా గౌవరం లేదని, ప్రజల పట్ల బాధ్యతలేదని వైసీపీ సభ్యులపై మంత్రి సవిత మండిపడ్డారు. చివరికి దైవం పట్ల పాపభీతి కూడా లేదన్నారు. ఎంతో పవిత్రమైన తిరుపతి లడ్డూ ప్రసాదాన్ని అపవిత్రం చేసి పాపం మూటకట్టుకున్నారని, ఇదే విషయం సీబీఐ వేసిన సిట్ సైతం స్పష్టం చేసిందని తెలిపారు. ఈ అంశం నుంచి ప్రజల దృష్టి మరల్చడానికి, సభలో చర్చలకు ఆటంకం కలిగించడానికి బడ్జెట్ సమావేశాలు ప్రారంభమైన నాటి నుంచి వైసీపీ సభ్యులు రచ్చ చేస్తున్నారన్నారు. ప్రజా సమస్యలతో పాటు తిరుపతి లడ్డూ అంశంపైనా చర్చకు సిద్ధంగా ఉన్నామని ప్రకటించినా వైసీపీ సభ్యులు పట్టించుకోవడం లేదన్నారు. ప్రజా సమస్యలపై చర్చించకుండా, తమ తప్పులు బయటపడకుండా వైసీపీ సభ్యులు ఎంతటి నీచానికైనా దిగజారిపోతున్నారని, సభను అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. తిరుపతి లడ్డూ కల్తీ వ్యవహారం బయటకు రావడంతో జగన్, వైసీపీ సభ్యులు డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నారని, ప్రజలను వారిని పట్టించుకోవడం మానేశారని అన్నారు. 33 ఏళ్ల నుంచి హెరిటేజ్ ప్రజల నమ్మకాన్ని గెలుచుకుని వ్యాపార ప్రస్థానాన్ని ముందుకు సాగిస్తోందన్నారు. హెరిటేజ్ కు, టీటీడీకి ఎటువంటి సంబంధమూ లేదని మంత్రి సవిత తేల్చిచెప్పారు.

# పురావస్తు తవ్వకాలు బౌద్ధ సర్క్యూట్‌కు పెద్దపీట

**– శాసనసభలో మంత్రి కందుల దుర్గేష్**

**(అంకుశం, అమరావతి, ఫిబ్రవరి 20):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని చారిత్రక వారసత్వాన్ని కాపాడేందుకు, పురావస్తు తవ్వకాలను ముమ్మరం చేయడంతో పాటు బౌద్ధ సర్క్యూట్‌లను అభివద్ధి చేస్తామని రాష్ట్ర పర్యాటక, సాంస్కతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. శుక్రవారం శాసనసభలో ప్రశ్నోత్తరాల సమయంలో అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ అడిగిన ప్రశ్నలకు మంత్రి కందుల దుర్గేష్ క్లుప్తంగా సమాధానమిచ్చారు. రాష్ట్ర విభజనకు ముందు ఆంధ్రప్రదేశ్ లో 65 ప్రాంతాల్లో, విభజన తర్వాత పురావస్తు శాఖ 3 ప్రధాన ప్రాంతాల్లో ఫీల్డ్ సీజన్ లో పురావస్తు శాఖ తవ్వకాలు జరిపిందని మంత్రి దుర్గేష్ తెలిపారు. 201415, 201516లో జరిపిన తవ్వకాల్లో కాకినాడ జిల్లా ఎ.కొత్తపల్లి (పెద్దమెట్ట) బౌద్ధ క్షేత్రంలో మహాస్థూపాలు,8 ఓటివ్ స్థూపాలు (చిన్న స్థూపాలు), విహారాలు(నివాస ప్రాంతాలు), ఎర్రమట్టి పాత్రలు బయటపడ్డాయని.. అలాగే పోలవరం ప్రాజెక్టు పూర్తయితే తవ్వకాలు జరపడం కష్టమని భావించి పోలవరం ముంపు ప్రాంతాలైన రుద్రమకోట, రాయనపేటలలో 201718 లో తవ్వకాలు జరపగా క్రీ.పూ. 1000300 నాటి ప్రాచీన మానవుడి సమాధులు (మెగా లిథిక్స్), ఇనుప వస్తువులు, మట్టి పాత్రలు లభ్యమయ్యాయని వివరించారు. తద్వారా ప్రాచీన మానవుడి కాలం నాటి సంస్కతి, అనుసరించిన విధానాలు గుర్తించామన్నారు. ఈ తవ్వకాలకు ప్రత్యేక బడ్జెట్ అంటూ ఏమీ లేదని పోలవరం ప్రాజెక్టులో భాగంగా పురావస్తు శాఖ ఎక్స్ కవేషన్ బడ్జెట్ లో నుండి వినియోగించి తవ్వకాలు జరిపామని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ అడిగిన విధంగా పురావస్తు శాఖ ద్వారా మరిన్ని తవ్వకాలు చేపట్టం, దొరికిన అవశేషాలను నిక్షిప్తం చేయడం, సంబంధిత అంశాలను గ్రంథస్తం చేయడం వాటిని ప్రజల సందర్శనార్థం మ్యూజియంలో పెట్టడం ఆవశ్యకమని భావిస్తున్నామని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. 154 పోస్టులకు గాను 54 మంది సిబ్బంది ఉన్నారని సిబ్బంది కొరతను తీర్చాలని కోరారు. కళింగుల రాజధానిగా కీర్తిపొందిన శ్రీకాకుళం జిల్లా దంతపురం, విజయనగరం జిల్లా గుడివాడకొండలలో రాబోయే రోజుల్లో తవ్వకాలు చేపడతామని మంత్రి దుర్గేష్ ప్రకటించారు. పురావస్తు శాఖలో సిబ్బంది కొరతను తీర్చడం, తవ్వకాల్లో దొరికిన అవశేషాలను భద్రపరిచి మ్యూజియాల్లో ప్రదర్శనకు ఉంచడంపై ప్రత్యేక దష్టి సారిస్తామన్నారు. హైదరాబాద్ లోని మ్యూజియం మాత్రమే కాక ఏలూరులోని మ్యూజియం, రాజమహేంద్రవరంలోని రాళ్ల బండి సుబ్బరావు మ్యూజియంలకు ప్రత్యేక చరిత్ర ఉందని ఆయా మ్యూజియాల్లో సంబంధిత నివేదికలు పొందుపరిచేందుకు అవకాశం ఉందన్నారు. బొబ్బిలి ఎమ్మెల్యే ఆర్.వి.ఎస్.కే.కే. రంగారావు(బేబీ నాయన) అడిగినట్లుగా చిత్రకోట బౌద్ధక్షేత్రం అంశం తమ పరిగణలో ఉందన్నారు. ఏపీలో బౌద్ధమత వ్యాప్తికి నిలయాలైన అమరావతి, నాగార్జునకొండ, ఘంటసాల, ఆదుర్రు, తొట్లకొండ, బావికొండ, చిత్రకోట వంటి ప్రాంతాలను కలిపి 'బౌద్ధ సర్క్యూట్'గా అభివద్ధి చేస్తామని మంత్రి దుర్గేష్ హామీ ఇచ్చారు.



# పిల్లల భద్రతకు అధిక ప్రాధాన్యత.

**– విజయనగరం జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్,**

**– గుడ్ టచ్–బ్యాడ్ టచ్, ర్యాగింగ్, ఈవ్ టీజింగు పట్ల ప్రతి విద్యార్థిని అవగాహన కలిగించాలి జిల్లా ఎస్పీ**

**అంకుశం న్యూస్ విజయనగరం ఫిబ్రవరి 20:** మహిళల భద్రతకు అధిక ప్రాధాన్యత కల్పించాలని, వారు ఇచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించి, వారి రక్షణకు భద్రత చర్యలు చేపట్టాలని అధికారులను జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్, ఫిబ్రవరి 20న ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ మాట్లాడుతూ – మహిళల భద్రతకు ప్రాధాన్యత కల్పించాలని, వారు ఇచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించి, భద్రత చర్యలు చేపట్టాలన్నారు. మహిళలపై జరుగుతున్న దాడులను నియంత్రించుటలో భాగంగా పోలీసు స్టేషన్లను ఆశ్రయించే మహిళలు, వారు చేసే ఫిర్యాదులపై తక్షణమే చర్యలు చేపట్టాలన్నారు. పోలీసు స్టేషన్లకు వచ్చే మహిళలతో పోలీసు సిబ్బంది మర్యాదగా మాట్లాడాలని, వారు చెప్పే విషయాలను శ్రద్ధగా వినాలని, వారి చెప్పే ఫిర్యాదులపట్ల సానుకూలంగా స్పందించి, చట్ట పరిధిలో వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. అంతేకాకుండా, విధిగా కళాశాలలు, పాఠశాలలను, మహిళలు ఎక్కువగా ఉండే ప్రాంతాలను శక్తి బృందాలు, ఇతర పోలీసు సిబ్బంది సందర్శించి, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, ర్యాగింగ్, ఈవ్ టీజింగు, వారికి రక్షణగా నిలిచే చట్టాలు పట్ల అవగాహన కల్పించాలన్నారు. ఆపద సమయంలో పోలీసులు సహాయం పొందే విధానంపట్ల అవగాహన కల్పించేందుకు జిల్లా పోలీసుశాఖ తరుపున చర్యలు చేపడుతున్నామన్నారు. ఇందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా పోలీసు అధికారులు, సిబ్బంది ప్రత్యేక డ్రైవ్ చేపట్టి తమ పోలీసు స్టేషను పరిధి లోని ముఖ్య కూడళ్లు, ఉన్నత పాఠశాలలు, కళాశాలలను, బస్టాండులు మరియు రైల్వే స్టేషన్ లను సందర్శించి ప్రజలు, మహిళలు, విద్యార్థినులతో మమేకమై, వారికి అర్థమయ్యే రీతిలో మహిళల రక్షణకు బాసటగా నిలిచే చట్టాల పట్ల అవగాహన కల్పించాలని అధికారులను జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ ఆదేశించారు. డ్రోన్ లను వినియోగించి శివారు ప్రాంతాలు, మరియు ఖాళీ ప్రదేశాలలో నిఘా ఏర్పాటుచేస్తున్నామని తెలిపిన జిల్లా ఎస్పీ. మహిళలు మరియు పిల్లల పై అఘాయిత్యాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని, రౌడీ షీట్స్ తెరుస్తామని, జైలుకు పంపుతామని హెచ్చరించిన జిల్లా ఎస్పీ.



## విద్యా లోకానికి వరం సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించే ప్రత్యేక కార్యక్రమం.

**– ప్రిన్సిపాల్ సురేష్ బాబు.**

**అంకుశం న్యూస్ ధర్మవరం ఫిబ్రవరి 20:** పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సిఎస్ఈ ఈసీఈ విద్యార్థుల కోసం నూతన సాంకేతిక పరి జ్ఞానము పెంపొందించె ప్రత్యేక ఉపన్యాస కార్యక్రమాన్ని (మదనపల్లి ఇన్స్టిట్యూట్ అఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్) మిట్స్ డీమ్డ్ టు బి యూనివర్సిటీ వారి చే ఏర్పాటు చేయించామని కళాశాల ప్రిన్సిపాల్ సురేష్ బాబు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మిట్స్ డీమ్డ్ టు బి యూనివర్సిటీకి అధ్యాపకులు జి .బి. రేణుక, డాక్టర్ జి రెడ్డి హేమంత లు పాల్గొన్నారు. సిఎస్ఈ విద్యార్థుల కోసం "క్లౌడ్ కంప్యూటింగ్ , బ్లాక్‌చైన్ సాంకేతికతలు" అంశంపై అందించిన ఉపన్యాసంలో క్లౌడ్ టెక్నాలజీ ప్రాముఖ్యత, డేటా నిల్వ విధానాలు, సైబర్ భద్రత, బ్లాక్‌చైన్ నిర్మాణ విధానం, భవిష్యత్ ఉద్యోగావకాశాలపై సమగ్ర అవగాహన కల్పించారు. అదేవిధంగా డాక్టర్ జి రెడ్డి హేమంత ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ విద్యార్థుల కోసం వి.ఎల్.ఎస్ఐ టెక్నాలజీ అంశంపై ప్రసంగించి, వీఎల్ఎస్ఐ రూపకల్పన ప్రాముఖ్యత, చిప్ డిజైన్ ప్రక్రియ, సెమీకండక్టర్ పరిశ్రమలో అవకాశాలు, పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాల అభివృద్ధి గురించి వివరించారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థులు ఆధునిక సాంకేతిక రంగాలపై విస్తృత అవగాహన పొందడంతో పాటు తమ భవిష్యత్ దిశా నిర్ధేశాలపై నిర్ణయం తీసుకోవచ్చని అన్నారు. ఈ కార్యక్రమానికి సహాయ సహకారాలు అందించిన మిట్స్ యూనివర్సిటీ యాజమాన్యానికి కళాశాల ప్రిన్సిపాల్ జె.వి సురేష్ బాబు విభాగాధిపతులు యెన్. బాల స్వామి,డాక్టర్ జి.హేమాంజ లు కృతజ్ఞతలు తెలిపారు.



## పెళ్లి అయ్యే వరకు ఫోన్ మాట్లాడంపై నిషేధం- వధూవరులిద్దరికీ ఆ కమ్యూనిటీ వింత షరతు!

ప్రస్తుత కాలంలో పెళ్లి కుదిరిందంటే చాలు కాబోయే వధూవరులిద్దరూ ఫోన్‌లో ముచ్చట్లు మొదలుపెట్టేస్తున్నారు. వివాహానికి ముందే అన్ని విషయాలను పంచుకుంటున్నారు. అందుతో తమ వ్యక్తిగత, కుటుంబ విషయాలు కూడా ఉంటున్నాయి. ఈ క్రమంలో మనస్పర్థలు, అనుమానాలు, అపోహలతో చాలా మంది పెళ్లికి ముందే విడిపోతున్నారు. నిశ్చితార్థం (ఎంగేజ్‌మెంట్) అయినప్పటికీ వివాహం వరకు బంధం కొనసాగట్లేదు. ఈ నేపథ్యంలో ఛత్తీస్‌గఢ్‌లో సేన్ కమ్యూనిటీ (సమాజం) కీలక నిర్ణయం తీసుకుంది. తమ సామాజిక వర్గానికి చెందిన వధువరూలిద్దరూ నిశ్చితార్థం తర్వాత తమకు కాబోయేవారితో ఫోన్ మాట్లాడడంపై నిషేధం విధించింది.

### ఏకగ్రీవంగా నిర్ణయం

నిశ్చితార్థం తర్వాత చాలా పెళ్లిళ్లు ఆగిపోవడాన్ని బలోద్ జిల్లాలోని సేన్ కమ్యూనిటీ చాలా సీరియస్‌గా తీసుకుంది. ఈ క్రమంలోనే నిశ్చితార్థం అయిన తర్వాత పెళ్లి వరకు తమకు కాబోయే భాగస్వామితో వధూవరులిద్దరూ రహస్యంగా ఫోన్‌లో మాట్లాడకూడదని నిర్ణయించింది. కాబోయే భర్త లేదా భార్యతో కుటుంబ సభ్యుల సమక్షంలో మాట్లాడొచ్చని స్పష్టం చేసింది. కాబోయే భార్యాభర్తలు ఒకరితో ఒకరు రహస్యంగా ఫోన్‌లో మాట్లాడడంపై నిషేధం విధించింది. ఈ మేరకు సేన్ కమ్యూనిటీ ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకుంది. ఆధునిక యుగంలో ఫోన్లు కుటుంబాలను విచ్ఛిన్నం చేస్తున్నాయని సేన్ కమ్యూనిటీ బరోద్ జిల్లా అధ్యక్షుడు సంతోష్? కౌశిక్ అభిప్రాయపడ్డారు. అందుకే మళ్లీ పాత విధానాలను అనుసరిస్తున్నామని పేర్కొన్నారు. నిశ్చితార్థం అయిన తర్వాత వివాహం వరకు కాబోయే వధూవరులిద్దరూ ఫోన్‌లో రహస్యంగా మాట్లాడకూడదని నిర్ణయించామని తెలిపారు. ఇటీవల కాలంలో తమ సామాజిక వర్గానికి చెందిన నిశ్చితార్థమైన చాలా జంటలు పెళ్లికి ముందే విడిపోయానని ఈ సందర్భంగా గుర్తు చేశారు. మొబైల్ ఫోన్‌లో గంటల తరబడి మాట్లాడటం వల్ల కుటుంబ సంబంధాలు దెబ్బతింటున్నాయని, అందుకే ఈ నిర్ణయం తీసుకున్నామని వెల్లడించారు. తమ సామాజిక వర్గం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నానని సేన్ కమ్యూనిటీ కార్యదర్శి సీమా కౌశిక్ తెలిపారు. సుదీర్ఘమైన ఆలోచనల తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు. "నిశ్చితార్థం తర్వాత మొబైల్ ఫోన్‌లలో మాట్లాడే ధోరణి సేన్ కమ్యూనిటీలో అనేక సంఘటనలకు దారితీసింది. చాలా మంది యువతీయువకులు నిశ్చితార్థం చేసుకున్నప్పటికీ, ఆ బంధం పెళ్లి వరకు వెళ్లలేదు" అని సీమా కౌశిక్ అభిప్రాయపడ్డారు.

## బాల్య వివాహాలు చేస్తే రెండేళ్ల జైలు, రూ.లక్ష జరిమానా

**–ఐ.సి.డి.ఎస్ సూపర్వైజర్ లీలావతి**

**రాప్తాడు అంకుశం న్యూస్ ఫిబ్రవరి 20 :** మండలంలో ఎవరైనా తల్లిదండ్రులు తమ పిల్లలకు బాల్య వివాహాలు చేస్తే రెండేళ్ల జైలు, రూ.లక్ష జరిమానా తప్పదని రాప్తాడు ఐ.సి.డి.ఎస్ సూపర్వైజర్ లీలావతి హెచ్చరించారు. బాల్య వివాహ రహిత ఆంధ్ర ప్రదేశ్ ప్రోగ్రాంలో భాగంగా రాప్తాడు రెండో అంగన్వాడీ కేంద్రంలో గురువారం బాల్య వివాహ నిర్మూలనకు 100 రోజుల జాతీయ అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించి అవగాహన కల్పించారు. ఆడపిల్లలకు 18ఏళ్ళు, అబ్బాయిలకు 21 ఏళ్లు పూర్తయిన తర్వాతనే వివాహం చేయాలన్నారు. నిర్దేశిత వయసులోపు వివాహా లు చేసినట్లయితే చట్టప్రకారం సంబంధిత అధికారులు చర్యలు తీసుకుంటారన్నారు. అదేవిధంగా వివాహానికి హాజరైన వారికి కూడా శిక్ష పడుతుందన్నారు. ఎక్కడైనా బాల్య వివాహం జరుగుతున్నదని తెలిసిన వెంటనే చైల్డ్ హెల్ప్ లైన్ 1098 లేదా పోలీస్ హెల్ప్ లైన్ 100 కు ఫోన్ చేయాలన్నారు. లబ్ధిదారులైన గర్భవతులకు బాలింతలకు బాల సంజీవని కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు విజయలక్ష్మి, లక్ష్మి, సావిత్రి ,భారతి, ముత్యాలమ్మ, హెల్పర్ సుశీల తదితరులు పాల్గొన్నారు.



## సర్వజనాసుపత్రిలో సమస్యలు పరిష్కరించండి

**– 1200పడకలకు తగిన విధంగా బడ్జెట్, సౌకర్యాలు కల్పించాలి**

**– అసెంబ్లీలో అనంత ఎమ్మెల్యే దగ్గుబాటి ప్రసాద్**

**అంకుశం న్యూస్ అనంతపురం ఫిబ్రవరి 20:** అనంతపురం జిల్లా కేంద్రంలోని పెద్దాసుపత్రిలో నెలకొన్న సమస్యల్ని, రోగులు పడుతున్న ఇబ్బందులను అసెంబ్లీ వేదికగా అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వివరించారు. శుక్రవారం జరిగిన సమావేశంలో ఉదయం పలు అంశాల గురించి వివరణ కోరారు. ముఖ్యంగా సర్వజనాసుపత్రిలో పరిస్థితులను, ఆగిన నిర్మాణాల గురించి ప్రస్తావించారు. అత్యంత వెనుకబడిన ఉమ్మడి అనంతపురం జిల్లాకు అతి పెద్ద ఆసుపత్రి ఇదేనని.. అయితే అందుకు తగిన విధంగా ఇక్కడ సౌకర్యాలు లేవన్నారు. పెరుగుతున్న జనాభా, ఆసుపత్రిలో అందిస్తున్న వినూత్న సేవల దృష్ట్యా.. ఇతర జిల్లాల నుండి కుడా రోగులు వస్తున్నారన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ సర్వజనాసుపత్రిలో 2వేల మందికి పైగా అవుట్ పేషెంట్లు, 1200మంది ఇన్ పేషెంట్లు ఉన్నారన్నారు. కానీ ప్రస్తుతం 560పడకలు గానే ఆసుపత్రి ఉందని.. అందుకే ఆసుపత్రిని 1205 పడకలకు అధికారికంగా పెంచాలని ఎమ్మెల్యే దగ్గుపాటి కోరారు. ఔషధాలు, శస్త్రచికిత్స సామగ్రి, ల్యాబ్ కెమికల్స్ కోసం తగినంత నిధులు మంజూరు చేయలేదన్నారు. డ్రగ్స్ కోసం అవసరమైన బడ్జెట్ 17.19 కోట్లు కాగా 10.88 కోట్లు మాత్రమే విడుదలవుతోందన్నారు. దీని వలన రోగులు ఇబ్బందులు పడుతున్నారని.. సర్జికల్స్ ఇతరత్రా సామాగ్రి అవసరాల కొరకు అవసరమైన బడ్జెట్ 79.35 కోట్లు కాగా 75.92 కోట్లు మాత్రమే విడుదలవుతోందన్నారు. అందుకే బడ్జెట్ ను కూడా వెంటనే పెంచాలని ఎమ్మెల్యే దగ్గుపాటి కోరారు. మాతా–శిశు బ్లాక్ నిర్మాణం కోసం 300 కోట్లు మంజూరు చేసి..600 పడకల ఎంసీహెచ్ బ్లాక్ ప్రతిపాదించారు కానీ.. ఆర్.అండ్.బి అధికారులు స్థలం హ్యాండ్ ఓవర్ చేయలేదన్నారు. ట్రామా కేర్ సెంటర్ మంజూరు చేసినప్పటికీ.. భవనం నిర్మాణం పూర్తయినా సిబ్బంది పోస్టులు భర్తీ చేయలేదన్నారు. సర్జికల్ బ్లాక్ నిర్మాణం ++7 గా ప్రతిపాదించినప్పటికీ ప్రస్తుతం ++1 మాత్రమే నిర్మిస్తున్నారని.. అవి కూడా 40% పనులు మాత్రమే పూర్తయ్యాయన్నారు. వీటిపై స్పందించి తగిన నిధులు మంజూరు చేసి సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ కోరారు..



## అక్రమ కర్ణాటక మద్యం విక్రయిస్తే చర్యలు ఎక్సయిజ్ డిప్యూటీ కమీషనర్ నాగ మద్దయ్య

**అంకుశం న్యూస్ ధర్మవరం ఫిబ్రవరి 20:** ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా కర్ణాటక మద్యం కానీ నాటు సారా కానీ అక్రమంగా విక్రయిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవని ప్రొబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య గారు హెచ్చరించారు. ధర్మవరం ఎక్సైజ్ స్టేషన్ అకస్మితగా తనిఖీ చేశారు. ఈ తనిఖీ లో భాగంగా స్టేషన్ రికార్డ్స్ ను పరిశీలించారు. ఎక్సైజ్ ఏపీ సురక్ష యాప్ ద్వారా ప్రతి షాపులో ప్రతి బాటిల్ ను స్కాన్ చేసి అమ్మకాలు జరపాలి.అదేవిధంగా తరచుగా బెల్ట్ షాపులు పై దాడులు నిర్వహించి కేసులు నమోదు చేయాలి మరియు ఎక్సైజ్ నేరములు చేసే వ్యక్తులను, పాత నేరస్థులను బైండోవర్ కేసులు నమోదు చేయాలి. అదేవిధంగా ప్రతి షాప్ లో వీక్లా రెట్లను అములు చెయ్యాలి.అని సూచించారు. ఈ కార్యక్రమం లో ఎన్ఫోర్స్మెంట్ ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరిడెంట్ శ్రీరామ్ గారు మరియు ధర్మవరం ఎక్సైజ్ సీఐ శ్రీమతి చంద్రమణి మరియు సిబ్బంది పాల్గొన్నారు.



## ఎన్ఆర్ఐ గృహ ప్రవేశంలో చెరుకూరి రవి

**పోరుమామిళ్ల, ఫిబ్రవరి 20(అంకుశం పత్రిక):** పట్టణంలోని వసుంధర కళ్యాణ మండపం ఎదురుగా వున్న ప్రముఖ సింగపూర్ ఎన్ఆర్ఐ శ్రీనివాసులు గృహప్రవేశానికి తెలుగుదేశం పార్టీ బద్వేల్ నియోజకవర్గ యువనాయకులు చెరుకూరి రవికుమార్ గురువారం హాజరు కావడం జరిగింది. ఆయనతోబాటు టీడీపీ నాయకులు నగిరి భైరవ ప్రసాద్, చెరుకూరి చెంద్రాయుడు, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్, నడిపి వెంకటసుబ్బయ్య ,పామూరు బాలిరెడ్డి, చంద్రగిరి ప్రహల్లద రెడ్డి , కల్లూరు దుగ్గిరెడ్డి, ఐత్రంపేట సర్పంచ్ జక్కుల పవన్, తదితర తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.



## సరస్వతి విగ్రహానికి భూమి పూజ

**.పోరుమామిళ్ల , ఫిబ్రవరి 20(అంకుశం పత్రిక):** మండలంలోని టేకూరుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ప్రధానోపాధ్యాయుడు బాల గంగిరెడ్డి ఆధ్వర్యంలో సరస్వతి విగ్రహం స్థాపించేందుకు గురువారం భూమి పూజ నిర్వహించారు. గ్రామంలోని దాతల సహకారంతో ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రధానోపాధ్యాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు పాఠశాల ఉపాధ్యాయిణీ, ఉపాధ్యాయులు మహబూబ్ బాష, గురయ్య, జాఫర్, శ్రీనివాసులు, గఫార్, రామసుబ్బయ్య, వీరయ్య, జ్యోతిలక్ష్మి, అనురాధ, పుష్పలత, రాజమ్మ, వెంకటేశ్వర్లు, రమాదేవి, రవి గ్రామప్రజలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## జగన్ రెడ్డిరైతుల పాసుపుస్తకాలపై

# నీ ఫోటో ఎలా వేసుకుంటావ్

- అసెంబ్లీ వేదికగా వైసీపీ నిర్వాకాన్ని నిలదీసిన ఎమ్మెల్యే పరిటాల సునీత
- అసెంబ్లీలో సునీత
- విద్యుత్ సబ్ స్టేషన్లు, ట్రాన్స్ ఫార్మర్లు, మెటీరియల్ ఇవ్వాలి

**అంకుశం న్యూస్ అనంతపురం ఫిబ్రవరి 20:** గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రైతులకు సంబంధించిన పాసుపుస్తకాలపై తన ఫోటోలు వేసుకోవడమే కాకుండా రీసర్వే పేరుతో ఆందోళన సృష్టించారని.. రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అసెంబ్లీ వేదికగా వైసీపీ నిర్వాకాన్ని ప్రశ్నించారు. శుక్రవారం జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ఆమె మరోసారి ప్రజా సమస్యలపై తన వాణి వినిపించారు. వైసీపీ పాలనలో విద్యుత్ రంగ వ్యవస్థను అస్తవ్యస్తంగా మార్చారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనలో మిగులు విద్యుత్తుతో పాటు విద్యుత్ ఛార్జీలు కూడా తగ్గించారన్నారు. ఈ బడ్జెట్లో సుమారు 14వేల కోట్ల కేటాయించారన్నారు. రాప్తాడు నియోజకవర్గంలో రెండు విద్యుత్ సబ్ స్టేషన్లను మంజూరు చేశారని.. ఇంకా సోమలదొడ్డి, బండమీదపల్లి, మన్నీల, ఆలమూరు, వేపకుంట, దాదులూరు, న్యామద్దల గ్రామాలలో నూతన సబ్ స్టషన్లు మంజూరు చేయాలని కోరారు. ఇప్పటికే దరఖాస్తు చేసిన 15వందల మంది రైతులకు ట్రాన్స్ ఫార్మర్లు, ఇతర మెటీరియల్, 100కిలోమీటర్లు కేబుల్ మంజూరు చేయాలన్నారు.



నియోజకవర్గంలో విద్యుత్ సిబ్బంది కొరత ఉందని.. లైన్ మెన్లు, ఏ.ఈ లను నియమించాలని కోరారు. ఎన్ని చర్యలు తీసుకున్నా.. అక్కడక్కడ లో ఓల్టేజ్ సమస్య ఏర్పడుతోందని దీనిని పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. మరోవైపు రెవెన్యూశాఖకు రూ“3868కోట్లు కేటాయించినందుకు ముఖమంత్రి చంద్రబాబు, ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ కు కృతజ్ఞతలు తెలిపారు. రాయలసీమ నేలపై పుట్టిన ఓ మహిళా ప్రజాప్రతినిధిగా, భూమి అంటే ఏంటి.. ఆ విలువ ఏంటి అనేది నాకు బాగా తెలుసన్నారు. భూమి అంటే కేవలం ఆస్తి కాదు రైతు భవిష్యత్తు అని సునీత అన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో తీసుకున్న నిర్ణయాలు, రాజకీయ అక్రమాల వల్ల రాష్ట్రంలో భూముల రికార్డులు గందరగోళంగా మారాయాన్నారు. రైతు తన సొంత భూమి పత్రం చూసుకుని కూడా భయపడే పరిస్థితి ఏర్పడిందన్నారు. రైతు పాసుపుస్తకంపై రాజముద్ర కాకుండా సైకో సీఎం ఫోటో వేసుకున్నారని విమర్శలు చేశారు. సుమారు 7వేల గ్రామాల్లో నిర్వహించిన రీ-సర్వేలో భారీ లోపాలు బయటపడ్డాయని.. 5వేల గ్రామాల్లో పంపిణీ చేసిన భూ హక్కు పత్రాల్లో తీవ్రమైన తప్పులు దొర్లాయన్నారు. ఈ ప్రభుత్వంలో నిర్వహించిన గ్రామసభల్లో 7లక్షల 50వేల ఫిర్యాదులు రావడం గత పాలన వైఫల్యానికి అద్దం పడుతోందన్నారు. మేము ఎక్కడికి వెళ్లిన రెవెన్యూ సమస్యలే మాకు వినిపిస్తున్నాయన్నారు. భూ హక్కు పత్రాలపై రాజకీయ నేత ఫోటోలు ముద్రించడం పరిపాలనా అహంకారానికి నిదర్శనమని సునీత వ్యాఖ్యానించారు. సర్వే రాళ్లపై బొమ్మల కోసం 7వందల కోట్లు, పత్రాలపై ఫోటోలకు 22కోట్లు ఖర్చు చేయడం ప్రజాధన దుర్వినియోగం కాదా అని వైసీపీని నిలదీశారు. వీటిన్నింటినీ కూటమి ప్రభుత్వం వచ్చాక ముఖ్యమంత్రి చంద్రబాబు సరి చేశారన్నారు. ఇది రైతుల నమ్మకాన్ని నిలబెట్టిన ప్రభుత్వం అని ఎమ్మెల్యే సునీత అన్నారు...

## ప్రాజెక్ట్ లకు సంబంధించి భూమి సేకరణ, భూమి బదలాయింపు వేగవంతం చేయాలి

- : పెండింగ్‌లో ఉన్న ప్రతిపాదనలను వెంటనే పూర్తి చేయాలి
- : జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్

**అంకుశం న్యూస్ అనంతపురం, ఫిబ్రవరి 20 :** జిల్లాలో ఆయా ప్రాజెక్ట్ లకు సంబంధించి భూమి సేకరణ, భూమి బదలాయింపు వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం అనంతపురం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో జాతీయ రహదారులు, రైల్వే, వివిధ ప్రాజెక్టులకు సంబంధించి భూసేకరణ, తదితర అంశాలపై సంబంధిత ఆర్డీఓలు, తహసీల్దార్లు, ఆయా శాఖల అధికారులతో జాయింట్ కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖలకు సంబంధించిన పెండింగ్ భూమి సేకరణ కేసులు, భూమి బదలాయింపు ప్రతిపాదనల పురోగతిని జాయింట్ కలెక్టర్ సమీక్షించారు.





- ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ భూ రికార్డుల ఖచ్చితత్వం, నిబంధనల ప్రకారం చర్యలు, ప్రతిపాదనల సమర్పణలో ఆలస్యం లేకుండా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచనలు జారీ చేశారు. భూమి సంబంధిత వ్యవహారాల్లో పారదర్శకతతో పాటు సమన్వయంతో వేగవంతంగా ప్రక్రియలు పూర్తిచేయాలని ఆదేశించారు. ఆయా ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ, భూ బదలాయింపులను పెండింగ్ లేకుండా త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. జాతీయ రహదారులు, రైల్వే, వివిధ ప్రాజెక్టులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న ప్రతిపాదనలను వెంటనే పూర్తి చేసి పంపించాలన్నారు. ఈ సమావేశంలో ఎన్.హెచ్ పిడి తరుణ్, నెడ్ క్యాప్ అధికారి కిషోర్, కలెక్టరేట్ ఈ సెక్షన్ సూపరింటెండెంట్ రియాజుద్దీన్, ఆర్డీఓలు, తహసీల్దార్లు, ఆయా శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ లక్ష్మీ నరసింహస్వామి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం

- శ్రీరామ్ కు ఘన స్వాగతం పలికిన మల్లాకాలువ గ్రామస్థులు
- స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన శ్రీరామ్

**అంకుశం న్యూస్ ధర్మవరం ఫిబ్రవరి 20:** ధర్మవరం మండలం మల్లాకాలువ గ్రామంలో జరిగిన శ్రీ లక్ష్మీ నరసింహస్వామి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో ధర్మవరం టీడీపీ ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ పాల్గొన్నారు. గ్రామస్థుల ఆహ్వానం మేరకు శుక్రవారం జరిగిన విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా గ్రామానికి వచ్చిన శ్రీరామ్ కు గ్రామస్థులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన విగ్రహ ప్రతిష్టాపన సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు శ్రీరామ్ కు ప్రత్యేకంగా ఆశీర్వచనాలు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీరామ్ మాట్లాడుతూ గ్రామంలో శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయ నిర్మాణంతో ఒక ఆధ్యాత్మిక వాతావరణం కనిపిస్తోందన్నారు. గ్రామస్థులంతా ఐక్యంగా ఆలయం నిర్మిస్తున్నారని.. ఇది మంచి పరిణామమన్నారు. గ్రామాల్లో ఉత్సవాలు, జాతరలు అందరి ఐక్యతకు చిహ్నంగా ఉంటాయన్నారు. ఆ స్వామి వారి ఆశీస్సులు ఈప్రాంత ప్రజలపై ఉండాలని.. పాడిపంటలతో రైతులంతా సంతోషంగా ఉండాలని శ్రీరామ్ ఆకాంక్షించారు.





## 'సోలార్' సమస్యల పరిష్కారం కోసం '1912'

- ఏపీఎస్పీడీసీఎల్ సిఎండి శివశంకర్ లోతేటి

**అంకుశం ప్రతినిధి తిరుపతి, ఫిబ్రవరి 20:** ఏపీఎస్పీడీసీఎల్ పరిధిలోని సోలార్ విద్యుత్ వినియోగదారులు సమస్యల పరిష్కారం కోసం టోల్-ఫ్రీ నంబరు: 1912ను సంప్రదించవచ్చని ఆ సంస్థ చైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్ లోతేటి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సోలార్ విద్యుత్ సంబంధిత సమస్యల పరిష్కారం కోసం వినియోగదారులు కాల్ సెంటర్ కి కాల్ చేయడం ద్వారా ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. కాల్ సెంటర్లో సోలార్ సంబంధిత ఫిర్యాదులను కూడా నమోదు చేసే సౌకర్యాన్ని నూతనంగా అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. వినియోగదారులు ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్ సిస్టమ్ (ఐవిఆర్ఎస్) ద్వారా ఫోన్/మొబైల్ స్క్రీన్ పై 5 అంకెను నొక్కి సోలార్ విద్యుత్ పిర్యాదులను నమోదు చేయవచ్చని తెలిపారు. ఈ ఫిర్యాదు ఆధారంగా నిర్దిష్ట సమయంలోగా సంబంధిత సోలార్ పరికరాల విక్రేత సమస్యను పరిష్కరించేందుకు అవకాశం ఉంటుందన్నారు. సమస్యను పరిష్కరించిన వెంటనే వినియోగదారునికి ఫీడ్ బ్యాక్ కాల్ చేయబడుతుందని, వినియోగదారుడు ఇచ్చే ఫీడ్ బ్యాక్ కు అనుగుణంగా పిర్యాదును మూసివేయడం/తెరవబడడం జరుగుతుందన్నారు. సంస్థ పరిధిలోని నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, కడప, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆ ప్రకటనలో కోరారు.



## గ్రామదేవతల దీవెనలే దేశాభివృద్ధికి పునాది.

- వైభవంగా పాత ముచ్చుమర్రిలో శ్రీ చౌదేశ్వరీదేవీ, శ్రీ మశమ్మ, శ్రీ గంగమ్మ నూతన ఆలయాల ప్రతిష్ట.
- నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి.

**అంకుశం న్యూస్ నంద్యాల్ ఫిబ్రవరి 20:** గ్రామదేవతల దీవెనలే దేశాభివృద్ధికి పునాది అని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు. శుక్రవారం నంద్యాల జిల్లా నందికొట్కూరు నియోజకవర్గం పగిడ్యాల మండలం పాత ముచ్చుమర్రి గ్రామంలో బైరెడ్డి కుటుంబం ఆధ్వర్యంలో, వేద పండితులు తెలకపల్లి రఘురామ శర్మ పర్యవేక్షణలో వైభవంగా శ్రీ చౌదేశ్వరీదేవీ, శ్రీ మశమ్మ, శ్రీ గంగమ్మ అమ్మవార్ల నూతన ఆలయాలు, విగ్రహాల ప్రతిష్ట నిర్వహించారు. గ్రామ దేవతలకు ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి, ఆమె భర్త డాక్టర్ శివచరణ్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖరరెడ్డి, ఆయన భార్య బైరెడ్డి భారతమ్మ, బైరెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి, ఆయన భార్య బైరెడ్డి శ్రీలత, కూతురు బైరెడ్డి అనూషా రెడ్డి, కర్నూలు ఎంపీ బస్తిపాడు నాగరాజు తదితరులు విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి మాట్లాడుతూ మా గ్రామం ముచ్చుమర్రి, నా నంద్యాల జిల్లా ప్రజలతో పాటు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని రాష్ట్ర ప్రజలు, భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలోని దేశ ప్రజలందరికీ గ్రామ దేవతల ఆశీస్సులు, దీవెనలు ఉండాలనీ ప్రత్యేక పూజలు చేశామన్నారు.



పాత ముచ్చుమర్రిలో శ్రీ చౌదేశ్వరీ దేవికి తొలి పూజ చేస్తున్న ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి దంపతులు, మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖరరెడ్డి దంపతులు

## 22ఎ నుండి ప్రైవేట్ భూముల తొలగించే అధికారం ఆర్డీవోలకు అప్పగింత

- శాసన సభలో రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ వెల్లడి

**(అంకుశం, అమరావతి, ఫిబ్రవరి 20):** రాష్ట్రంలో 22ఎ కింద ఉన్నప్రైవేట్ భూముల తొలగించే అధికారం ఆర్డీవోలకు అప్పగించినట్లు రెవెన్యూ, రిజిస్ట్రేషన్, స్టాంప్స్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ వెల్లడించారు. సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానం ఇస్తూ.. గత ప్రభుత్వ పాపాల కారణంగా పెరిగిపోయిన 22ఎ నిషేధిత జాబితా భూముల పరిష్కారానికి ప్రత్యేక డ్రైవ్ . 22ఎ జాబితా భూముల తొలగింపు సరళతరం చేసేలా అధికారాల బదలాయింపు. ఒక వేళ ఏదైనా భూమిని 22ఎ జాబితాలో చేర్చాలంటే ఆ పట్టాదారునికి రిజిస్టర్డ్ పోస్ట్ ద్వారా గానీ, ఈ కేవైసీ ద్వారా గానీ నోటీసులు తప్పనిసరిగా ఇవ్వాలి. ఆ తర్వాత కచ్చితమైన విచారణ చేసి సరైన కారణాలతో ఉత్తర్వులు ఇవ్వాలి. పదేళ్లకు పూర్వం అసైన్ చేసిన ఇంటి స్థలాలన్నింటికీ పూర్తి హక్కులు కల్పించబోతున్నాం. ఇనాం భూములపై జీవోఎం త్వరలోనే పరిష్కారాన్ని చూపుతుంది. రికార్డులు ట్యాంపర్ చేయడానికి వీల్లేకుండా బ్లాక్ చైన్ టెక్నాలజీ ద్వారా రెవెన్యూ, సర్వే, రిజిస్ట్రేషన్ శాఖలను ఒకే డిజిటల్ వ్యవస్థ కిందకు తెస్తున్నాం. పాత రెవెన్యూ రికార్డులను అత్యాధునిక టెక్నాలజీతో స్కాన్ చేసి.. శాశ్వత డిజిటల్ గుర్తింపుతో భద్రపరుస్తున్నాం. గత ప్రభుత్వంలో రీ సర్వే, ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ ద్వారా లక్షా 75 వేల ప్రభుత్వ, ప్రయివేట్ భూములను కాజేయాలని వైసీపీ నేతలు ప్రయత్నించారు అని పేర్కొన్నారు.



## విజయవాడ దుర్గమ్మ, దశావతార వెంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు

- ఆలయాల్లో ఎమ్మెల్యే పరిటాల సునీత





**అంకుశం న్యూస్ విజయవాడ ఫిబ్రవరి 20:** అత్యంత పవిత్రమైన పాల్గుణ శుక్రవారం సందర్భంగా రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత పలు ఆలయాలను సందర్శించారు. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో ఆమె విజయవాడ ప్రాంతంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలను దర్శించుకున్నారు. విజయవాడ కనకదుర్గమ్మ అమ్మవారిని, నంబూరు, నాగార్జున యూనివర్సిటీ సమీపంలోని దశావతార వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. ఎమ్మెల్యే సునీతకు ఆలయ మర్యాదాలతో అధికారులు, అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారికి, స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు తీర్థప్రసాదాలు, ఆశీర్వచనాలు అందజేశారు. పాల్గుణ శుక్రవారం సందర్భంగా అమ్మవారిని, వెంకటేశ్వరస్వామిని దర్శించుకోవడం సంతోషంగా ఉందన్నారు. వారి దివ్య ఆశీస్సులు రాష్ట్ర ప్రజలపై ఉండాలని ఆమె ఆకాంక్షించారు.

## పచ్చదనం పర్యావరణకీ కోసం కృషి !

- దాసరి గోవిందరాజులు

**అంకుశం న్యూస్ ధర్మవరం ఫిబ్రవరి 20:** పచ్చదనం కోసం అందరూ తమ వంతు కృషి చేయాలని ధర్మవరం మార్కెట్ యార్డు సమీపంలో గల ధన్య ఫ్యూల్స్ పెట్రోల్ బంకు యజమాని దాసరి గోవిందరాజులు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ చెట్లను పెంచాలని అవి మన ప్రగతి పురోగతి కి మార్గం అన్నారు. పచ్చదనం తో ప్రకృతి వికాసం అన్నారు. చల్లని నీడ నిచ్చే చెట్లు పెంచడం కూడా ఒక కళ అని చెప్పారు.




## ట్రాన్స్ జెండర్లు సంక్షేమం కోసం ప్రభుత్వం చొరవ చూపాలి

**అంకుశం ప్రతినిధి విజయవాడ ఫిబ్రవరి:20:** రాష్ట్రంలో ట్రాన్స్ జెండర్లు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ప్రభుత్వం పరి సంక్షేమం కోసం తీసుకోవాలనీ ప్రభుత్వం ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబును పుట్టపర్తి నియోజకవర్గం ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి ప్రత్యేకంగా కోరారు. విజయవాడ అమరావతిలో జరుగుతున్న శాసనసభ సమావేశాల్లో శుక్రవారం ప్రశ్నోత్తరాల సమయంలో ట్రాన్స్ జెండర్లు సమస్యలపై పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి అసెంబ్లీ వేదిక ద్వారా ప్రత్యేకంగా ప్రస్తావించారు. ట్రాన్స్ జెండర్లు డిగ్రీ,నర్సింగ్ ,బిటెక్ వంటి టెక్నికల్ కోర్సులు పూర్తి చేసినవారు ఉన్నారు. గత జనవరిలో మహిళా శిశు సంక్షేమం,వయో వృద్ధులు ,వికలాంగులు ,ట్రాన్స్ జెండర్లు సంక్షేమ అభివృద్ధిపై తిరుపతి లో శాసన సభ మహిళా కమిటీ సభ్యులు పర్యటించినప్పుడు ట్రాన్స్ జెండర్లు పలు సమస్యలను కమిటీ సభ్యురాలైన తన దృష్టికీ తీసుకొచ్చారని గుర్తు చేశారు. బాగా చదువుకొన్నప్పటికీ ఎలాంటి ఉద్యోగాలు రావడం లేదని ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించాలని ట్రాన్స్ జెండర్లు కోరినట్లు తెలిపారు. అదే విధంగా వీరికి బ్యాంకులు కూడా రుణాలు ఇవ్వడం లేదని కనీసం స్వయం ఉపాధి కింద ఆర్థిక రుణాలు బ్యాంకులు ఇచ్చే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ప్రత్యేకంగా కోరారు. ట్రాన్స్ జెండర్లు సమస్యలపై ప్రభుత్వం స్పందించి వారి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ప్రభుత్వానికి కోరారు.



## టిటిడి ఆధ్వర్యంలో మార్చి 9న అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఏర్పాట్లపై జేఈవో సమీక్ష

**అంకుశం న్యూస్ తిరుపతి ఫిబ్రవరి 20:** టిటిడి ఆధ్వర్యంలో మార్చి 9వ తేదీన నిర్వహించనున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఏర్పాట్లపై తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలో గల మీటింగ్ హాల్లో జెఈఓ( విద్య, ఆరోగ్యం) డా.ఏ శరత్ సమీక్ష నిర్వహించారు.



ఈ సందర్భంగా జేఈఓ మాట్లాడుతూ, ఈ ఏడాది మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని, ఇందుకోసం టిటిడి మహిళా అధికారులు, సిబ్బంది సమన్వయంతో ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఇప్పటికే ఏర్పాటు చేసిన ఆర్గనైజింగ్ కమిటీ, స్పీకర్స్ కమిటీ, పర్చేజ్ కమిటీ, కల్చరల్ కమిటీ, ఇన్విటేషన్ కమిటీ, ఫుడ్ కమిటీల విధులు, బాధ్యతలను తెలియజేశారు. వివిధ రంగాల్లో నిపుణులైన వారిని ఉపన్యాసకులుగా ఆహ్వానించాలని సూచించారు. టిటిడి మహిళా ఉద్యోగులకు అందించే పద్మావతి అవార్డులు ఈ ఏడాది మరిన్ని పెంచాలని, ఇందుకోసం నైపుణ్యం, ప్రతిభ ఆధారంగా అర్హులైన అన్ని తరగతుల ఉద్యోగులను ఎంపిక చేయాలని అన్నారు. శ్రీ పద్మావతి అమ్మవారి వేద ఆశీర్వచనంతో మహిళా దినోత్సవాన్ని ప్రారంభించాలని, శ్రీ పద్మావతి వైభవం నృత్య కార్యక్రమంతో ముగించాలని చెప్పారు. ఈ సమీక్షలో సంక్షేమ విభాగం డెప్యూటీ ఈవో శ్రీ ఆనంద రాజు, మహిళా అధికారులు, మహిళా ఉద్యోగుల సంఘం నాయకులు, మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

## సంపూర్ణ అక్షరాస్యత లక్ష్యం

**రాప్తాడు అంకుశం న్యూస్ ఫిబ్రవరి 20:** మండలంలో అక్షరాస్యత పెంపొందించడమే లక్ష్యమని ఎంపీడీఓ బి.విజయలక్ష్మి అన్నారు. రాప్తాడు ఐసిడిఎస్ కార్యాలయంలో శుక్రవారం ఉల్లాస్ అక్షరాంధ్ర పోస్టర్లను డిప్యూటీ ఎంపిడిఓ(ఎంఎస్ ఓ) అచ్యుతానంద బాబు, అడల్ట్ ఎడ్యుకేషన్ సూపర్వైజర్ కందుకూరు రమణ, ఐసిడిఎస్ సూపర్వైజర్లు లీలావతి, వాణి, పొదుపు సంఘాల మహిళలతో కలసి విడుదల చేశారు. వయోజన విద్యను ప్రోత్సహించడం, నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చడం లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.

